# తీన్మార్

teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 202 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 19 నవంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## పోలీస్ యూనిఫాంలో కీలక మార్పు

### టీజీగా మారిన టిఎస్పీ అనే అక్షరాలు

### హెూంశాఖ కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పోలీస్ యూనిఫాంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు యూనిఫాం బ్యాడ్జీలో తెలంగాణ స్టేట్ పోలీస్ టిఎస్పీ అనే అక్షరాలు ఉండేవి. వాటిని తెలంగాణ పోలీస్ టీజీగా మార్చారు. లోగోలోనూ తెలంగాణ స్టేట్ పోలీస్ టిఎస్పీగా ఉండగా ఇకపై తెలంగాణ పోలీస్‌గా

మిగతా 2 లో






# ఢిల్లీలో కాలుష్య నిరోధక చర్యలు

### ఇతర రాష్ట్రాల "భారీ" వాహనాల ప్రవేశం నిషేధం

### తీవ్ర స్థాయికి దిగజారిన గాలి నాణ్యత



న్యూ ఢిల్లీ, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ఈ సోమవారం ఉదయం 8 నుండి ఢిల్లీ-ఎన్సీఆర్ లో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ 4ని విధించాలని నిర్ణయించింది. ఈ ప్రాంతంలో గాలి నాణ్యత తీవ్ర స్థాయికి దిగజారడంతో ఈ చర్య తీసుకోబడింది. జీఆర్‌ఏపీ-4 ప్రకారం, ఇతర రాష్ట్రాల నుండి భారీ వాహనాల ప్రవేశాన్ని ఢిల్లీలో నిషేధించారు. అయితే, నిత్యావసర వస్తువులను తరలించే మరియు అవసరమైన సేవలను అందించే ట్రక్కులను అనుమతిస్తారు. అన్ని సీఎన్జీ, ఎలక్ట్రిక్ మరియు బీఎస్-VI డీజిల్ ట్రక్కులు కూడా ఢిల్లీలోకి ప్రవేశించడానికి అనుమతించబడతాయి. ఢిల్లీ ప్రభుత్వం 10 మరియు 12 తరగతులు మినహా విద్యార్థులందరికీ శారీరక తరగతులను నిలిపివేయాలని నిర్ణయించింది. తదుపరి ఆదేశాల వరకు అన్ని పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సోషల్ మీడియా పోస్ట్‌లో తెలియజేశారు.

# నేడు వరంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన

### కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవం, పలు పనులకు శంకుస్థాపనలు

వరంగల్ జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి నేడు వరంగల్ లో పర్యటించనున్నారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో పాటు ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభలో పాల్గొననున్నారు రేవంత్.



.. వివరాలు 2లో



## రాష్ట్రంలో ప్రశ్నిస్తే సంకెళ్లు, నిలదీస్తే అరెస్టులు

### విచారణకు రమ్మని పిలిచి అక్రమంగా అరెస్ట్ చేస్తారా..?

### రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ప్రశ్నిస్తే సంకెళ్లు, నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారని రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు. నియంత రాజ్యమిది, నిజాం రాజ్యాంగమిది. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తి చూపినందుకే కొణతం దిలీపు అరెస్ట్ చేశారు. విచారణకు రమ్మని పిలిచి అక్రమంగా అరెస్ట్ చేస్తారా? ఎన్నాళ్లు ఈ అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తావు. నీ అక్రమ అరెస్టులకు భయపడేవాడు ఎవరూ లేరిక్కడ అంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే

మిగతా 2 లో



### పలు చెరువుల కబ్జాలపై హైడ్రాకు

## స్థానికుల ఫిర్యాదు

### చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): సిటీ పరిధిలో ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడేందుకు హైడ్రా పనిచేస్తుందని కమిషనర్ రంగనాథ్ అన్నారు. సిటీలోని పలు చెరువుల కబ్జాలపై హైడ్రాకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మియాపూర్ లోని చందానగర్‌డివిజన్‌పరిధిలోని భక్షికుంట, రేగులకుంట చెరువులను రంగనాథ్ పరిశీలించారు. స్థానికులతో

మిగతా 2 లో

## అటవీ శాఖలో పేపర్ రహిత పాలనకు శ్రీకారం

### నిధులు, విధులు వంటి వివరాలను ఆన్‌లైన్‌లో




తెలంగాణ బ్యూరో, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): అటవీ శాఖలో పేపర్ రహిత పాలనకు అధికారులు శ్రీకారం చుట్టారు. నిధులు, విధులు వంటి వివరాలను ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎక్కడెక్కడ నర్సరీలు ఏర్పాటు చేశారు, ఏ నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచుతున్నారు, ఎన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి, ఇప్పటి వరకు ఎక్కడెక్కడ ప్లాంటేషన్ చేశారు వంటి వివరాలను జిల్లా, డివిజన్, రేంజ్ ల వారీగా ఆన్ లైన్‌లో పొందుపరుస్తున్నారు. గతంలో జిల్లా, డివిజన్

మిగతా 2 లో



## దమ్ముంటే కేంద్ర తరపున కమిటీ వేసి పంపించాలి

### ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ పెద్దలకు సవాల్

### ప్రభుత్వంపై బీజేపీ విమర్శలకు స్పందించిన రేవంత్‌రెడ్డి

తెలంగాణ బ్యూరో, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీపై దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం తరపున ఓ కమిటీ వేసి

మిగతా 2 లో




## మరింత విస్తరించనున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు

### దేశవ్యాప్తంగా మరో 500 కొత్త బ్రాంచీలను ఏర్పాటుకు నిర్ణయం

### కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

న్యూ ఢిల్లీ, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను మరింత విస్తరించనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశవ్యాప్తంగా మరో 500 కొత్త బ్రాంచీలను ఏర్పాటు

మిగతా 2 లో



## కొత్తగూడెం, రామగుండం ఎయిర్ పోర్టులకు లైన్ క్లియర్

### హైదరాబాద్ - వరంగల్ రోడ్ల విస్తరణకు కేంద్రం అంగీకారం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

2

## ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లో ఫీజు మినహాయింపు



### హైదరాబాదును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతాం

### కొత్త ఈవీ పాలసీ వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం

.. వివరాలు 2లో




## ప్రశాంతంగా ముగిసిన టీజీపీఎస్సీ గ్రూప్ 3 పరీక్షలు

### తొలిరోజు కేవలం 50.7 శాతం హాజరు నమోదు

### ప్రశ్నపత్రాలు మధ్యస్థంగా ఉందంటున్న నిపుణులు

హైదరాబాద్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టీజీపీఎస్సీ గ్రూప్ 3 పరీక్షలు ఆది, సోమ వారాలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 3 పేపర్లకు ఈ పరీక్షలు జరిగాయి. నవంబర్

మిగతా 2 లో

## వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉండదు

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

### తండ్రి, కొడుకు, కూతురు తప్ప ఎవరూ మిగలబోరని ఎద్దేవా



.. వివరాలు 2లో



### ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుల బెయిల్

## పిటిషన్లపై విచారణ

### విచారణ వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

.. వివరాలు 2లో

# నేడు వరంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన

వరంగల్ జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి నేడు వరంగల్ లో పర్యటించనున్నారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో పాటు ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభలో పాల్గొననున్నారు రేవంత్.


**రేవంత్ వరంగల్ షెడ్యూల్**

- నవంబర్ 19న హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో మధ్యాహ్నం 2:30 గంటలకు వరంగల్ కు వెళ్తారు.
- నవంబర్ 19న మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:10 ని వరకు కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవం, కాళోజి ఆర్ట్ గ్యాలరీ సందర్శన.
- 3:20 గంటల నుంచి 3:55 ని. వరకు ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఇందిరా మహిళా శక్తి మేళాలోని స్టాల్స్ సందర్శన.
- 3:55 ని. నుండి 5 గంటల వరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభలో ప్రసంగించనున్న సీఎం రేవంత్ రెడ్డి.

**బహిరంగ సభకు ముందే ఓరుగల్లుపై సీఎం వరాలు.**

- మామునూర్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి తొలిగిన ఆటంకాలు.





- భూసేకరణకు 205 కోట్ల నిధులు విడుదల చేస్తూ జీ.వో జారీ చేసిన ప్రభుత్వం

**కుడా మాస్టర్ ప్లాన్ కు ఆమోదం.**

- వరంగల్ సిటీ ఫ్యూచర్ డెవలప్మెంట్ ను దృష్టిలో పెట్టుకొని విజన్ 2041కు ప్రభుత్వం ఆమోదం
- కూడా మాస్టర్ ప్లాన్ ను ఆమోదిస్తూ జీ.వో 202 జారీ
- గ్రేటర్ వరంగల్ సిటీ అడ్మినిస్ట్రేషన్ టవర్ల నిర్మాణానికి రూ.32.50 లక్షల నిధులు మంజూరు.
- ఇన్నర్ రింగ్ రోడ్డు పొడిగింపు
- 8.30కి.మీ ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.80 కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ

## రాష్ట్రంలో ప్రశ్నిస్తే సంకెళ్లు, నిలదీస్తే అరెస్టులు



మొదటి పేజీ తరువాయి

కొణతం దిలీప్ గారిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. విచారణకు రమ్మని పిలిచి అక్రమంగా అరెస్ట్ చేస్తారా? అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో ఎన్నాళ్లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారని నిలదీశారు. ప్రజాస్వామ్య ప్రేమికులం ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటామని పేర్కొన్నారు. నీ అక్రమ అరెస్టులకో నీ ఉడత బెదిరింపులకో భయపడేది లేదు, ఈ అక్రమ అరెస్టులకు భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరని పేర్కొన్నారు. మిస్టర్ రాహుల్ గాంధీ అంటూ ఆయనను ఉద్దేశించి ఇంగ్లీష్‌లో మరో ట్వీట్ చేశారు. మీ ద్వంద్వ వైఖరి కలవరపెడుతోందని, అసలు మీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మోదీ-అదానీ కలిస్తే స్కాం అయితే రేవంత్-అదానీ కలిస్తే న్యాయం అవుతుందా? అని నిలదీశారు.

## ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లో ఫీజు మినహాయింపు

హైదరాబాద్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రవాణా శాఖ పరంగా మార్పులు తీసుకొచ్చి ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సెక్రటేరియట్‌లో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో హైదరాబాదును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో వాహనదారులకు ఏడాదికి సుమారు రూ.లక్ష చొప్పున మిగులుతుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం నుంచే కొత్త ఈవీ పాలసీ వస్తుందని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్‌లో కాలుష్యం రాకుండా చేసేందుకు ఈవీ పాలసీ తీసుకొచ్చామన్నారు. గతంలో 2020-2030 ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ తీసుకొచ్చారని పొన్నం ప్రభాకర్ అన్నారు. జీవో నెంబర్ 41 ద్వారా 2026 డిసెంబర్ 31 వరకు ఉంటుందని చెప్పారు. సోమవారం నుంచి ఈ జీవో ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల పాలసీ అమలులోకి వస్తుందని తెలిపారు. తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాలకు పరిమితి లేదని పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మార్చాలని ప్రణాళికలు తెచ్చామని తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించాలంటే ఈవీలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. హైదరాబాద్‌లో ఇప్పుడున్న మూడు వేల బస్సులు స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

## అటవీ శాఖలో పేపర్ రహిత పాలనకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

వివరాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు రేంజ్ లకు సంబంధించిన వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. ఏ రేంజ్‌లో ఏం పనులు చేస్తున్నారు, కేటాయించిన నిధులు, నమోదైన కేసులు, జంతువుల వేట, కలప స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన వాహనాలు తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చేస్తున్నారు. కవ్వాల్, అమ్రాబాద్, నెహ్రూ పార్క్, అర్బన్ పార్కుల తదితర వివరాలు కూడా నెట్ లో అందుబాటులో ఉంచారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం లింక్ లు అందుబాటులోకి తీసుకొచ్చారు. క్లిక్ చేస్తే ఫారెస్ట్, పార్కు వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి.

**తునికాకు కూలీలకు ఆన్‌లైన్‌లో పేమెంట్**

తునికాకు కూలీలకు అటవీ శాఖ నేరుగా వారి అకౌంట్‌లో డబ్బులు జమచేస్తున్నది. గతంలో కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తే, వారు చెల్లించేవారు. కాంట్రాక్టర్లు కూలీల డబ్బును దుర్వినియోగం చేస్తుండటంతో కూలీల అకౌంట్‌లో అధికారులు డబ్బులు వేస్తున్నారు. తునికాకు సేకరణ వివరాలు కూడా రోజువారీగా నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా టింబర్ డిపో, సామిల్స్ అనుమతులు, లైసెన్స్ రెన్యూవల్ వివరాలను కూడా ఆన్ లైన్‌లో పొందవచ్చు. ఎవరైనా వారి సొంత స్థలంలో చెట్లు తొలగించాలంటే రూ.450 చెల్లించి ఆన్ లైన్ లో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఫారెస్ట్ ఆఫీసుకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. దీంతో సమయం వృథా అయ్యేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. అలాగే కలప స్మగ్లింగ్, జంతువుల వేటకు సంబంధించిన కేసులు తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నారు. 2023-24లో 3,424 కేసులు నమోదయ్యాయి. అడవి జంతువుల దాడిలో పశువులు, మనుషులు గాయపడితే పరిహారం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఎంత పరిహారం ఇచ్చారనే వివరాలు అందుబాటులో ఉంటాయి.

**రోజుకు నాలుగుసార్లు ఫైర్ అలర్ట్ మెసేజ్‌లు**

అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు, ఆక్రమణలపై పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. అడవిలో ఏం జరిగినా శాటి లైట్ల ద్వారా క్షణాల్లో తెలిసిపోతుంది. అగ్ని పోర్టల్ లో ఫారెస్ట్ అధికారుల నంబర్లతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ రాజ్, అగ్రికల్చర్ తదితర డిపార్ట్ మెంట్లకు సంబంధించిన అధికారుల నంబర్లను రిజిస్టర్ చేస్తారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే రిజిస్టర్ అయిన నంబర్లకు మెసేజ్ వస్తుంది. ఏ లొకేషన్ లో ప్రమాదం జరిగిందో మెసేజ్ వస్తుంది. రోజుకు నాలుగుసార్లు మెసేజ్‌లు వస్తాయి. పగలు రెండు, రాత్రి రెండుసార్లు అలర్ట్ మెసేజ్‌లు వస్తాయి. 2023- 24 సంవత్సరంలో 14,048 అగ్నిప్రమాద హెచ్చరికలు రాగా.. 13,736 ప్రదేశాలకు అధికారులు వెళ్లారు. 215 చోట్ల ఫైర్ అయినట్లు మెసేజ్ వచ్చినా అక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదని గుర్తించారు.

## పలు చెరువుల కబ్జాలపై హైడ్రాకు స్థానికుల ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు అందించిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులు కబ్జా కాకుండా చూస్తామని చెరువు స్థలాలతో పాటు, వివిధ కాలనీల్లో పార్కుల కోసం ఇతర ప్రజా అసవరాల కోసం కేటాయించిన స్థలాలను హైడ్రా కాపాడుతుందని అన్నారు. రేగులకుంట చెరువు స్థలాన్ని హైడ్రా కాపాడుతుంది. ఇప్పటికే స్థానిక అధికారులు ఆదేశిస్తున్నాం. తక్కువ ఖర్చుతో రెండు చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా ఇతర మార్గాలను పరిశీలించాం. ఈ రెండు చెరువులతో పాటు నగరంలో 10 చెరువులను మొదటి దశలో అభివృద్ధి చేస్తాం. అని రంగనాథ్ అన్నారు.

## కొత్తగూడెం, రామగుండం ఎయిర్ పోర్టులకు లైన్ క్లియర్




తెలంగాణ బ్యూరో, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): కొత్తగూడెం, రామగుండం ఎయిర్ పోర్టులకు కేంద్రం నుంచి లైన్ క్లియర్ అయ్యిందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. హైదరాబాద్ - వరంగల్ రోడ్ల విస్తరణకు కేంద్రం అంగీకారం తెలిపిందన్నారు. నారపల్లి వరకు ఉన్న ఫ్లై ఓవర్ పనులు తర్వగా పూర్తి చేస్తామన్నారు కోమటిరెడ్డి. వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఓరుగల్లు అభివృద్ధికి రూ.4170 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. మంచినీటి సరఫరా వ్యవస్థల నిర్మాణాలు చేపడుతామన్నారు. కేంద్రాన్ని ఒప్పించి మూమునూరు ఎయిర్ పోర్టును సాధించామన్నారు కోమటిరెడ్డి. మామునూరు ఎయిర్ పోర్టు విస్తరణకు మరింత భూమి కావాలన్నారు. నవంబర్ 17న భూసేకరణకు జీవో రిలీజ్ చేశామన్నారు. ఢిల్లీ,బెంగళూరు తరహాలో మామునూరు ఎయిర్ పోర్ట్ ను డెవ్ లప్ చేస్తామన్నారు. ఇప్పటికే వరంగల్ లో మెగా టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేశామన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన టీజీపీఎస్సీ గ్రూప్ 3 పరీక్షలు



మొదటి పేజీ తరువాయి

17న ఉదయం సెషన్‌లో 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 1 పరీక్ష, అదేరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరిగింది. ఇక నవంబర్ 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 3 పరీక్ష నిర్వహించడంతో మూడు పేపర్లకు పరీక్షలు పూర్తయ్యాయి. మొత్తం 1,365 గ్రూప్ 3 సర్వీసు పోస్టుల భర్తీకి గానూ ఈ రాతపరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,401 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,36,400 మంది అభ్యర్థులు గ్రూప్ 3కి దరఖాస్తు చేయగా వారిలో పేపర్ 1 పరీక్షకు 2,73,847 మంది, పేపర్ 2 పరీక్షకు 2,72,173 మంది హాజరయ్యారు. అంటే తొలిరోజు మొత్తం కలిపి 50.7 శాతం హాజరు నమోదైందని టీజీపీఎస్సీ తెలిపింది. పేపర్ 1 ప్రశ్నపత్రంలో నిర్ణీత సమయంలోగా అన్ని సమాధానాలు గుర్తించేందుకు సమయం సరిపోలేదని కొందరు అభ్యర్థులు వాపోయారు. మధ్యాహ్నం జరిగిన పేపర్ 2 పరీక్ష ప్రశ్నపత్రం మధ్యస్థంగా ఉందని వివరించారు. పేపర్ 1 పరీక్షలో ఆస్కార్ అవార్డుపై ఓ ప్రశ్న రావడం గమనార్హం. ఆస్కార్ అవార్డు-2024కు నామినేట్ చేయబడిన డాక్యుమెంటరీ చలనచిత్రం 'టు కిల్ ఎ టైగర్' (%శీ ఖఱశ్రీశ్రీ ఖ ుఱస్త్రవతీ%)' దర్శకుడు ఎవరు? అనేదే ఆ ప్రశ్న.. ఇందుకు ఆర్. మహదేవన్, నిఖిల్ మహాజన్, కార్తీకి గొన్సల్వ్స్, నిషా పహుజ ఆప్షన్లు ఇచ్చారు. సరైన సమాధానం.. నిషా పహుజ ఇలా కొన్ని ప్రశ్నలు నేరుగా సమాధానం గుర్తించేవిగా ఉండగా, మరికొన్ని లోతైన విశ్లేషణలతో కూడుకున్నవిగా ఉన్నట్లు తెలిపారు. గ్రూప్ 3 పరీక్ష పేపర్ 1, 2 ప్రశ్నపత్రాలు మధ్యస్థంగా ఉందని అభ్యర్థులు, నిపుణులు పేర్కొన్నారు. లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ మినహా.. మిగిలిన అంశాల్లో ప్రశ్నలు చాలావరకు నేరుగానే అడిగారని తెలిపారు. కఠినస్థాయితో పాటు సులభ స్థాయి ప్రశ్నలు తక్కువగా, మధ్యస్థంగా ఉండే ప్రశ్నలు ఎక్కువగా వచ్చాయని తెలిపారు. ఈ రోజు జరిగిన పరీక్షకు ఎంత మంది అభ్యర్థులు హాజరయ్యారనే విషయం ఇంకా తెలియరాలేదు.

## దమ్ముంటే కేంద్ర తరపున కమిటీ వేసి పంపించాలి



మొదటి పేజీ తరువాయి

తెలంగాణకు పంపించాలని ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ పెద్దలకు సవాల్ విసిరారు. రాష్ట్రానికి వచ్చేందుకు మీ దగ్గర డబ్బులు లేకపోతే చెప్పాలని నేనే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తానని చాలెంజ్ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఉన్న సీఎం రేవంత్ సోమవారం పుణేలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో మేం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చేసి చూపించామన్నారు. 25 రోజుల్లో రూ.18 వేల కోట్లతో 23 లక్షల మంది రైతులకు రుణవిముక్తి కల్పించామన్నారు. కేంద్ర కమిటీ రాష్ట్రానికి వస్తే దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇస్తామన్నారు. రాహుల్ గాంధీ, ఖర్గే నేతృత్వంలో రైతులకు ఇచ్చిన అతి పెద్ద గ్యారెంటీ రుణమాఫీని అమలు చేశామన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతులు, పేదలు, నిరుద్యోగుల కోసం ఏమి చేయలేదని, ఇన్ని వైఫల్యాలు వారి వైపు ఉన్నప్పటికీ ప్రధాని మోడీ మా గ్యారెంటీల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. సన్న రకం వరిపై ఎంఎస్పీ మీద రూ.500 బోనస్‌ను రైతులకు ఇస్తున్నామన్నారు.

**11 ఏళ్లలో మోడీకి సక్సెస్ స్టోరీనే లేదు**

కాంగ్రెస్ గ్యారెంటీ అంటే భారతీయ ఝూటా పార్టీ గ్యారెంటీ, మోడీ గ్యారెంటీ కాదని సీఎం రేవంత్ విమర్శించారు. రాజకీయాల్లో నష్టం వచ్చినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ఆరు నూరైనా హామీలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. ప్రధాని మోడీకి ఈ 11 ఏళ్లలో ఎలాంటి సక్సెస్ స్టోరీ లేదని, మహారాష్ట్రలో కోవర్ట్ అపరేషన్ పాలిటిక్స్ నడిపారని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్, అశోక్ చౌహాన్ వారి పార్టీలకు వెన్నుపోటు పొడిచి మోడీకి గులాములుగా మారి ముంబయిని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం వేళ పీఎం మోడీ విదేశీ పర్యటనకు వెళ్లడం ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటమిని అంగీకరించిందని విమర్శించారు.

## మరింత విస్తరించనున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు

మొదటి పేజీ తరువాయి

చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విస్తరణతో ఎస్‌బీఐ బ్రాంచీల సంఖ్య 23,000కు చేరుకోనుందని తెలిపారు. ముంబై లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం 100వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1921లో మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులను విలీనం చేసి ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ ఇండియా గా ఏర్పాటు చేశారు. 1955 సంవత్సరంలో పార్లమెంట్ లో చట్టం ద్వారా దీనిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్చారు. ప్రారంభ దశలో 250 బ్రాంచీలతో ఉన్న ఎస్‌బీఐ, వచ్చే ఏడాది మార్చి నాటికి 23,000 బ్రాంచీలకు చేరుకోనుంది అని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఎస్బీఐకి దేశవ్యాప్తంగా 6580 ఏటీఎం లు ఉన్నాయని, బ్యాంక్ డిపాజిట్ల వాటా 22.4 శాతంగా ఉందని వెల్లడించారు. అలాగే 50 కోట్లకుపైగా కస్టమర్లు ఎస్‌బీఐకు ఉన్నారని, రోజుకు దాదాపు 20 కోట్ల యూపీఐ లావాదేవీల ను సంస్థ నిర్వహిస్తోందని ఆమె తెలిపారు.

## వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉండదు

తెలంగాణ బ్యూరో, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ ఉండదన్నారు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. హరీష్ రావు కూడా పక్క చూపులు చూస్తున్నారని అన్నారు. చివరకు బీఆర్ఎస్ లో తండ్రి, కొడుకు, కూతురు తప్ప ఎవరూ మిగలబోరని ఎద్దేవా చేశారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్. బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన అభివృద్ధి... తాము 11 నెలల్లో చేసిన అభివృద్ధిపై హరీష్ రావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు మహేశ్ కుమార్ గౌడ్. అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. బీజేపీ,బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీపై కుట్ర పన్నుతున్నాయన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ఆగం చేస్తే కాంగ్రెస్ పార్టీ రిపేర్లు చేస్తుందన్నారు. బంగారు తెలంగాణ అంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయం అయ్యిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీటలు బారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కట్టిన ప్రాజెక్టు 70 ఏళ్లయిన ఇంకా చెక్కు చెదరలేదన్నారు.

## పోలీస్ యూనిఫాంలో కీలక మార్పు




మొదటి పేజీ తరువాయి

మార్చాలని హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సూచించే అధికారిక సంక్షిప్త నామాన్ని ప్రభుత్వం టీజీగా మారుస్తూ గతంలోనే రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు సైతం జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, అధికారిక హోదాలు సూచించే బోర్డుల్లో %+%గా మార్పులు చేయాలని సూచించారు. ప్రభుత్వ జీవోలు, నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, లెటర్ హెడ్స్, పాలసీ పేపర్లు, అధికారిక పత్రాల్లోనూ టీజీ వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ మేరకు ఇప్పటికే తెలంగాణ ఆర్టీసీని టిఎస్‌ఆర్టీసీ స్థానంలో టీజీఆర్టిసి గా మార్పులు చేశారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కూడా టిఎస్ స్థానంలో టీజీగా చేస్తున్నారు. తాజాగా తెలంగాణ పోలీస్ బ్యాడ్జ్, లోగోను కూడా మార్చారు. తెలంగాణ పోలీస్ బ్యాడ్జిల్లోనూ మార్పులు చేస్తూ రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పోలీస్ బ్యాడ్జిలపై ఉన్న టిఎస్ ను టీజీగా మార్చారు. సివిల్, ఏఆర్, టిఎస్-ఎస్పీ, సార్ సిపీఎల్, పీటిఓ విభాగాలకు సంబంధించి కానిస్టేబుల్ నుంచి నాన్‌కేడర్ ఎస్పీల వరకు ప్రస్తుతం టిఎస్పీ గా ఉన్న పీక్ క్యాప్ మోనోగ్రామ్‌ను ఇకపై టీజీపీగా మార్చారు. అలాగే ఇప్పటివరకు తెలంగాణ స్టేట్ పోలీస్‌గా ఉన్న లోగోను తెలంగాణ పోలీస్‌గా మార్పులు చేశారు. టిఎస్ఎస్పీ షోల్డర్ బ్యాడ్జీని టిజిఎస్పీ గా, టిఎస్పీ షోల్డర్‌బ్యాడ్జిని టీజీపీగా, టిఎస్పీసీ షోల్డర్ బ్యాడ్జిని టీజీపీఎస్ గా మార్చారు. తెలంగాణ ఆవిర్భావం కంటే ముందు టీజీ అనే పేరు ఎక్కువగా వాడుకలో ఉండేది. ఉద్యమ కారులు నిరసనలు వ్యక్తం చేసేందుకు తమ వాహనాల నెంబర్ ప్లేట్లపై టీజీ అనే రాసుకునేవారు. అయితే రాష్ట్ర ఆవిర్భావం, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాన్ని తెలంగాణ స్టేట్ టిఎస్ పేరుతో రిజిస్ట్రేషన్లను చేయించారు. దీంతో అప్పటి నుంచి టిఎస్ పేరు వ్యవహారికంలో ఉండేది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ఉద్యమ సమయంలో ఉపయోగించిన టీజీ నే వినియోగించాలని డిసైడ్ చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుల బెయిల్ పిటిషన్ల పై విచారణ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ బ్యూరో, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుల బెయిల్ పిటిషన్ల పై విచారణను తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో రాధాకిషన్ రావు, భుజంగరావు కీలక నిందితులుగా ఉన్నారు. వీరి బెయిల్ గడువు ముగియడంతో మరోసారి బెయిల్ కోరుతూ విడివిడిగా హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం వీరి బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. రాధాకిషన్ రావు బెయిల్ పిటిషన్ ను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేయగా భుజంగరావు పిటిషన్ ను ఈ నెల 28న విచారించాలని నిర్ణయించింది. కాగా ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇటీవలే పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల కు కూడా నోటీసులు అందాయి. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందులో ఎంతటి వారున్న వదిలేది లేదని తేల్చి చెప్పింది.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## ప్రతి రూపాయికి రెండున్నర రూపాయిలు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ప్రపంచంలోని సుప్రసిద్ధ అంతరిక్ష సంస్థల్లో ఒకటి. ఇస్రో స్పేస్ ఏజెన్సీలో పెట్టుబడి పెట్టిన డబ్బు సమాజానికి మేలు చేసిందా లేదా అనే అంశంపై భారత అంతరిక్ష సంస్థ ఇటీవల జరిపిన అధ్యయనంలో ఆ సంస్థ ఖర్చు చేసే ప్రతి రూపాయికి రూ. 2.5 రాబడి వస్తుందని ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. అంతరిక్షయానం చేసే దేశాల మధ్య ఆధిపత్యం కోసం పోటీ పడడం కంటే దేశానికి సేవ చేయడమే ఇస్రో లక్ష్యమని స్పష్టం చేశారు. "చంద్రునిపైకి వెళ్లడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. మేము నిధుల కోసం ప్రభుత్వంపై మాత్రమే ఆధారపడలేం. మనం వ్యాపార అవకాశాలను సృష్టించుకోవాలి" అని ఆయన అన్నారు. కర్ణాటక ప్రభుత్వంలోని సాంఘిక సంక్షేమ శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ డైలాగ్ సెషన్‌ను నిర్వహించాయి. 'ఇస్రో లక్ష్యం దేశానికి సేవ చేయడమే తప్ప అంతరిక్ష రంగంలో ఆధిపత్య పోరులో చేరడం కాదు. ఇస్రోకు ఏది చేయాలన్నా స్వేచ్ఛ కావాలి. స్పేస్ టెక్నాలజీలో వ్యాపార అవకాశాల కోసం పర్యావరణ వ్యవస్థను రూపొందించడం ద్వారా స్వాతంత్ర్యం సాధించవచ్చని ఆయన అన్నారు. చంద్రునికి సంబంధించిన మిషన్లు చాలా ఖరీదైనవని ఇస్రో ఛైర్మన్ అన్నారు. అటువంటి పరిస్థితిలో, ఇస్రోకు నిధుల కోసం ప్రభుత్వంపై మాత్రమే ఆధారపడలేమన్నారు. ఇస్రోలకు వ్యాపార అవకాశాలను కల్పించాలని సోమనాథ్ అన్నారు. వీారు దీన్ని కొనసాగించాలనుకుంటే, వీారు ఇస్రో ఉపయోగాన్ని నిరూపించుకోవాలి. లేకుంటే మనం ఏదైనా పని చేసినప్పుడు దానిని ఆపమని ప్రభుత్వం కోరుతుందన్నారు. దీనికి సంబంధించి ఇస్రో కేవలం స్పేస్ వర్క్ కంటే చాలా ఎక్కువ చేస్తుందన్నారు. ప్రస్తుతం మత్స్యకారులకు సలహాలు ఇస్తున్నామని చెప్పారు. మత్స్యకారులకు తమ చేపలు ఎక్కడ దొరుకుతాయో కూడా మేము సలహా ఇస్తున్నామన్నారు. దీంతో మత్స్యకారులు తమ పడవలకు అవసరమైన డీజిల్‌ను చాలా వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. 2014 నుంచి 2024 మధ్య ఈ పదేళ్లలో అంతరిక్ష రంగం దేశ జీడీపీకి 60 బిలియన్ డాలర్లు సమకూర్చిందని నివేదిక వెల్లడించింది. ఈ రంగంలో వెచ్చించే ప్రతి డాలర్‌కు 2.54 డాలర్ల ఆదాయం వస్తోందని తెలిపింది. 2023 నాటికి భారత అంతరిక్ష రంగం ఆదాయం 6.3 బిలియన్ డాలర్లకు చేరి.. ప్రపంచంలో ఎనిమిదో అతిపెద్ద స్పేస్ ఎకానమిగా నిలిచింది. ఈ ఏడాదిలోని 96,000 ఉద్యోగాలతో సహా 4.7 మిలియన్ ఉద్యోగాలను సృష్టించింది. 2024 నాటికి భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు రూ. 6,700 కోట్లు (8.4 బిలియన్ డాలర్లు), గ్లోబల్ స్పేస్ ఎకానమీలో ఇది 2%–3% వాటా. ఇది 2025 నాటికి 6% వృద్ధి సాధించి 13 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. వచ్చే దశాబ్దం నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 10% వాటాను స్వాధీనం చేసుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇస్రో ఏర్పడినప్పటి నుంచి గత 55 ఏళ్లలో ఇప్పటి వరకు పెట్టిన మొత్తం పెట్టుబడి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ఒక్క సంవత్సరం బడ్జెట్ కంటే తక్కువ. ఇస్రో ప్రస్తుత వార్షిక బడ్జెట్ సుమారు 1.6 బిలియన్ డాలర్లు కాగా... నాసా ప్రస్తుత వార్షిక బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. ఇది అంతరిక్షంపై భారత్ చేస్తున్న వ్యయం కంటే దాదాపు 15.5 రెట్లు అధికం. భారతదేశంలో ప్రస్తుతం 400 ప్రైవేట్ స్పేస్ కంపెనీలు ఉన్నాయి. 2020లో ఇది కేవలం 54 మాత్రమేఇస్రో అంచాన ప్రకారం గతేడాది డిసెంబరు 31 వరకు ప్రయివేట్, విద్యా సంస్థలకు చెందిన వాటితో కలిసి 127 ఉపగ్రహాలను నింగిలోకి పంపిది. అలాగే, 97 రాకెట్లను ప్రయోగించి, 432 విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చించింది. నివేదిక ప్రకారం.. ఇస్రో ఉపగ్రహ ఆధారిత వాతావరణ అంచనాల ద్వారా రోజూ 8 లక్షల మత్స్యకారులు, 140 కోట్ల మంది భారతీయులు ప్రయోజనం పొందుతున్నారు. 25 సెంటీమీటర్ల రిజల్యూషన్‌తో భారత్‌కు చెందిన గూఢచారి ఉపగ్రహాలు ప్రపంచంలోనే అత్యుత్తమమైనవి. ఇతర గ్రహాలపై అన్వేషణ, పరిశోధనల్లోనూ భారత్ ముందుంది. చంద్రుడి, అంగారకుడి కక్ష్యలకు తొలి ప్రయత్నాల్లోనే గుర్తించి భారత్ చరిత్ర సృష్టించింది. చంద్రయాన్–3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన ఇస్రో.. ప్రస్తుతం ఆదిత్య ఒ–1 ఉపగ్రహం ద్వారా సూర్యుని 24బీ7 అధ్యయనం చేస్తోంది. భారతదేశ అంతరిక్ష కార్యక్రమం యొక్క ప్రయోజనాలను అంచనా వేసే యూరోపియన్ స్పేస్ కన్సల్టెన్సీ నోవాస్పేస్ సహకారంతో ఇస్రో రూపొందించిన భారతీయ అంతరిక్ష కార్యక్రమాన్ని సోషియో–ఎకనామిక్ ఇంపాక్ట్ అనాలిసిస్‌ను సోమనాథ్ ప్రస్తావించారు. అయితే, డాలర్ల పరంగా అంతరిక్ష రంగం పొందుతున్న రాబడుల గురించి నివేదిక పేర్కొంది. భారత్ ఇటీవల అంతరిక్ష ప్రయోగాల కోసం రూ. 22.7 వేల కోట్ల బడ్జెట్‌తో భారీ ప్రణాళికను ప్రకటించింది.

దీనిలో చంద్రుడిపై జరిగే ప్రయోగంలో తదుపరి దశ, శుక్రుడి అధ్యయనానికి ఆర్బిటర్‌ను పంపడం, భారతీయ అంతరిక్ష కేంద్రం మొదటి భాగాన్ని నిర్మించడం, ఉపగ్రహాలను ప్రయోగించడానికి పునర్వినియోగ రాకెట్‌ను అభివృద్ధి చేయడం వంటివి ఉన్నాయి. అంతరిక్ష ప్రాజెక్టుల కోసం ఒక్కసారి భారత్ కేటాయించిన అతి పెద్ద బడ్జెట్ ఇదే. కానీ, ఈ మిషన్లను పరిశీలిస్తే బడ్జెట్ చాలా తక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇవన్నీ జరిగితే ఇతర దేశాలతో పోల్చినప్పుడు మరోసారి తక్కువ బడ్జెట్‌లో అద్భుతమైన ఫలితాలను సాధించిన భారతీయ స్పేస్ ప్రోగ్రామ్‌గా ఇది నిలుస్తుంది. అంతరిక్ష యాత్రలను భారత్ తక్కువ ఖర్చుతో నిర్వహిస్తుండటంపై ప్రపంచవ్యాప్తంగా నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మంగళ్‌యాన్ ప్రాజెక్టును కేవలం రూ. 622 కోట్ల ఖర్చుతో చేయగలిగింది. గత సంవత్సరం చంద్రయాన్–3 కోసం దాదాపు రూ. 630 కోట్లు ఖర్చు చేసింది. అప్పట్లో గ్రావిటీ అనే హాలీవుడ్ సినిమాకు ఇంతకన్నా ఎక్కువ బడ్జెట్ (రూ. 841 కోట్లు) పెట్టినట్లు ప్రచారం జరిగింది. నాసా తయారు చేసిన మావెన్ ఆర్బిటర్ ఖరీదు సుమారు రూ. 4,800 కోట్లు. చంద్రయాన్–3 సక్సెస్‌ఫుల్ ల్యాండింగ్‌కు ముందు, క్రాష్ అయిన రష్యా లూనా–25 మిషన్ ఖర్చు దాదాపు రూ. 1,118 కోట్లు. భారత్ చాలా తక్కువ ఖర్చుతోనే ఎంతో విలువైన వర్క్ చేస్తోందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

## మొబైల్ ఫోన్లను అప్పగించిన ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి

పెబ్బేరు, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మడం తాండ గ్రామానికి చెందిన తులసన్న, పెబ్బేరు పట్టణానికి చెందిన ఎండి సలీం వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సోమవారం బాధితులకు అందజేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గుమ్మడం తాండ గ్రామానికి చెందిన తులసన్న, పెబ్బేరు పట్టణానికి చెందిన ఎండి సలీం దాదాపు కొన్ని రోజుల క్రితం వారి మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా వారి మొబైల్ ఫోన్లను గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకుని బాధితులకు పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా సెల్ పోన్ పోగొట్టుకున్నట్లయితే వివరాలను సీఈఐఆర్ ఫోర్టల్ నమోదు చేస్తే ఫోన్లను గుర్తించడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఎవరికైనా మొబైల్ ఫోన్లు దొరికితే వాటిని వెంటనే పోలీస్ స్టేషన్ లో అందించాలని ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి కోరారు.



మొబైల్ తిరిగి తమ చేతికి వచ్చినందుకు సిఈఐఆర్ పోర్టల్ చాలా ఉపయోగపడిందని తిరిగి మొబైల్ ను ఎస్ఐ చేతుల మీదుగా తీసుకోవడంతో వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి

దేవరకద్ర, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ గుర్తింపు అంశంపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలో బహిరంగ విచారణకు విచ్చేసిన తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు మహబూబ్ నగర్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అత్యధికంగా బీసీలు ఉన్నారని, రేపు కులగణన జరిగిన తర్వాత వచ్చిన లెక్కల ఆధారంగా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 50 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్స్ కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా



అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సారంగి లక్ష్మి కాంత్, కుమ్మరి సంఘం జిల్లా ప్రెసిడెంట్ బుగ్గన్న తదితరు పాల్గొన్నారు.

## మహిళల హక్కుల పై ప్రతి ఒక్కరు పోరాడాలి

**– మహిళ సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి**

పెబ్బేరు, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): మహిళల హక్కులపై ప్రతి ఒక్కరు పోరాడాలని మహిళలకు ఎలాంటి అన్యాయం జరిగిన మహిళ సాధికారత కేంద్రం అండగా ఉంటుందని మహిళ సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి అన్నారు. సోమవారం పెబ్బేరు మున్సిపాలిటీలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెబ్బేరు పట్టణ కేంద్రంలో మహిళ సాధికారత కేంద్రం, సభ్యులు మహిళా సంఘాల సభ్యులతో సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి కేంద్రం సేవలు, మహిళ సాధికారత, మహిళ చట్టాలు గృహ హింస చట్టం, పని చేసే చోట లైంగిక వేదింపులు చట్టం, బాల్య వివాహాలు, పలు పథకాల గురించి కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళ సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత మహిళా సంఘాల సభ్యులకు మరియు అందరికీ బాధ్యత ఉందని అన్నారు. బాల్య వివాహాలతో ఎన్నో దుష్పరిణామాలు సంభవిస్తాయని




చెప్పారు. చిన్నతనంలో గర్భం దాల్చడం వల్ల ఒక్కోసారి తల్లి ప్రాణాలకు ముప్పుగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం సభ్యులు సలోమి, రాధా, మహిళా సంఘం నాయకురాలు అక్కల జ్యోతి, బ్యాంకు మేనేజర్ శ్రావణ్, ఫీల్డ్ ఆఫీసర్ నోవా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ అంబెడ్కర్ విగ్రహ ఆవిష్కరణను విజవంతం చేయాలి

**రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క)**

ములుగు, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా తాడ్వాయి మండల మేడారంలో ప్రపంచ మేధావి, భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ బీ ఆర్ అంబెడ్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ ను ఆవిష్కరణ చేసిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు గౌరవనీయులు శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగపేట మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాణం రోజు అనగా నవంబర్ 26 రోజునా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీ ఆర్ అంబెడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, శ్రామికులు, కార్మికులు,



కర్షకులు, అన్ని పార్టీల రాజకీయ నాయకులు, అన్ని కుల సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, అంబెడ్కర్ సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొనీ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీ

మహబూబాబాద్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం హైస్కూల్ స్థాయి విద్యార్థిని, విద్యార్థులకు " దేశభక్తి గీతాల "పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సినీగేయ రచయిత, అమ్మకు దండం పెడతా పుస్తకం రచయిత కవి కందుల ప్రేమ్ కుమార్, మాట్లాడుతూ పాట ప్రజల చైతన్య దీపికని అన్నారు. పాట పరిధి చిన్నది పవర్ గొప్పది, పాట మాట కన్నా, ఆ మాటకొస్తే తూటా కన్నా, ఇంకా అంటే అణువు కన్నా, ఎక్కువ పెట్టిన ధనస్సు కన్నా, మహాశక్తివంతమైందని అన్నారు.. పాట మల్లెల్ని కాదు మంటల్ని కూడా చిమ్ముతుందని, అది చేతాడంతా వ్యాసమైన, ఉపన్యాసమైన, మూడు నిమిషాల పాటకు సాటి రాదని తన రాగంతో రస రమ్య లోకాలను సృష్టిస్తుందని అన్నారు. తన లయ లహరిలో ఊయలూపుతుందని. తన భావాన్ని సూటిగా, దాటిగా, నాటి ఆలోచింపజేస్తుందని ఆచరణకు పురిగొల్పుతుందని పాట పోరాటాల బాటగా మారి అక్రమాలను అడ్డుకొని కోటగా నిలిచిందని, ఉద్యమాల ఊపిరిగా ప్రచారాల మాధ్యమంగా ఎంతగానో ప్రసిద్ధి చెందిందని స్వరాష్ట్ర సాధనలో పాటలే చైతన్య



దీపికలై రాష్ట్ర ఆవిర్భావానికి నాంది పలికాయని స్వరాష్ట్రం వచ్చిందంటే పాటే ప్రధాన ఆయుధమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత లైబ్రెరియన్స్ జి విజయేందర్ సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్, బొడ్డుపల్లి భూలక్ష్మి, అబ్బ గాని భాస్కర్ హిమబిందు, మాధవి బాలాజీ, విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు సాహితీవేత్తలు పుస్తక ప్రియులు తదితరులు పాల్గొన్నారు.

## పొనుగోడు లో ఘనంగా ఇరుముడి కార్యక్రమం



గరిడేపల్లి, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండల పొనుగోడు గ్రామంలో శ్రీ ధర్మ శాస్త్ర పీఠం స్వాములు 41 ఒక్క రోజుల దీక్షని పూర్తి చేసుకొని గ్రామంలోని శివాలయంలో దీక్ష స్వాములు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి. ఇరుముడి ధరించి శభరి మల అయ్యప్ప స్వామి సన్నిధికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నేడే రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



దేవరకద్ర, నవంబర్ 18(తీన్మార్ న్యూస్): రాచాల పుట్టినరోజు సందర్భంగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడు ప్రశ్నించే గొంతుక పాలమూరు ముద్దుబిడ్డ బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా నేడే మంగళవారం ఉదయం 10:00 గంటలకు కొత్తకోట పట్టణంలోని బీపీర్ గార్డెన్ లో "రెడ్ క్రాస్ సొసైటీ" ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలి. కావున రాచాల అభిమానులు, ఆయన శ్రేయోభిలాషులు, స్నేహితులు తదితరులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మదనాపూర్ మండల అధ్యక్షులు బిసి పొలిటికల్ జెఎసి మహేందర్ నాయుడు తెలిపారు.

## ఘనంగా భగవాన్ బీర్స ముండా 150వ జయంతి వేడుకలు





కన్నాయి గూడెం, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): భగవాన్ బీర్స ముండా 150వ జయంతి వేడుకలులో వేడుకలులో భాగంగా ములుగులో నిర్వహించిన గిరిజన గౌరవ దినోత్సవ సమారోహము కార్యక్రమంకు మండలంలోని సర్వాయి గ్రామ పోడు రైతులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరు అయిన పోడు రైతులకు, ఎంపీ బలరామ్ నాయక్, ఎస్టి కార్పొరేషన్ డైరెక్టర్ శరత్ సార్ మరియు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉచితంగా మినుముల విత్తనాలు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి తేజోవతి, మండల వ్యవసాయ మహేష్, నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆఫీసర్ నవ్యత, ఈరయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి కళ్యాణి రైతులు పాల్గొన్నారు

## మత్తు పదార్థాలను దహనం చేసిన ఎక్సైజ్ శాఖ

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లాలోని పలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో పట్టుబడిన నిషేధిత గంజాయి, డైజోపాం, అల్రాజోలం లాంటి రూ.1.05 కోట్ల విలువైన మత్తు పదార్థాలను ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. నిజామాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమి రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె. మల్లారెడ్డి పర్యవేక్షణలో జక్రాన్పల్లి మండలం పడ్కల్ గ్రామంలో మెడికేర్ సర్వీసెస్ లో వివిధ ఎక్సైజ్ స్టేషన్ (ఆర్మూర్, భీమ్గల్, నిజామాబాద్, మోర్తాడ్లలో ) రూ.1.05 కోట్ల విలువైన 353 కిలోల ఎండు గంజాయి, 1.5 కిలోల డైజో ఫామ్, 2.5 కేజీల ఆల్ఫా జలం డిస్ట్రాయ్ చేశారు. భీంగల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8 కేసులలో 102.5 కేజీ గంజాయి, ఒక కేజీ డైజో ఫామ్, 1/2 కేజీ అల్ఫ్రా జలం దహనం చేశారు.

# వ్యాధులపై అవగాహన సదస్సు మరియు ఉచిత వైద్య శిబిరం





ములుగు, నవంబర్ 18 )తీన్మార్ న్యూస్): రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు శ్రీమతి ధనసరి సీతక్క, జిల్లా కలెక్టర్ టీ.ఎస్ దివాకర గార్ల, ఆదేశాలతో ములుగు మండలంలోని రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో, జంగాలపల్లి గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. గోపాలరావు ఆధ్వర్యంలో, జిల్లా మాత సంరక్షణ ఆరోగ్యం మరియు పోషణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, ఇంచార్జ్ మాస్ మీడియా ఆఫీసర్ సంపత్ అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ దుర్గారావు , సబ్ యూనిట్ ఆఫీసర్ సాంబయ్య రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ మరియు వైద్య సిబ్బంది జంగాలపల్లిలో ఏర్పాటు చేసిన వ్యాధులపై అవగాహన సదస్సు మరియు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు వైద్య బృందంతో వీధి వీధిన తిరిగి , గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, జంగాల పల్లిలో ఇప్పటివరకు జరిగిన మరణాలు దీర్ఘకాలిక వ్యాధులు మరియు వృద్ధాప్యంలోని సహజ మరణాలే అని ,దీనికి ప్రజలు భయభ్రాంతులకు గురి కావద్దని, దయ్యాల భూతాల వల్ల మరణాలు సంభవిస్తున్నాయని అపోహ పడవద్దని ప్రజలకు ధైర్యం చెప్పారు. మూఢనమ్మకాలు నమ్మవద్దని, భూత వైద్యం, పసరు వైద్యము, తీసుకోవద్దని, క్వాలిఫైడ్ గాని ఆర్.ఎం.పి, పి.ఎం.పి ల వద్ద చికిత్స తీసుకో కూడదని, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని, 30 సంవత్సరాలు పైబడిన వారందరూ, బీపీ, షుగర్ పరీక్షలు చేసుకోవాలని, నిర్ధారణ అయిన వారు బీపీ షుగర్ మందులు వాడాలని, డిఎంహెచ్వో, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్, MLHP,S సూపర్వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు తో ర్యాలీని నిర్వహించి, గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ దోమల లార్వాను గుర్తించి నీటి నిల్వలను పారబోసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని క్లోరిన్ చేసిన నీటిని త్రాగాలని ప్రజలకు బోధించారు. వైద్య సిబ్బంది బాల బాలికల ఉన్నత పాఠశాల సందర్శించి అక్కడి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, నీటి నిల్వలపై మూతలు పెట్టుకోవాలని, పోషకాహారం పట్ల అవగాహన కల్పించారు. జంగాలపల్లి గ్రామపంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి 180 మందికి వైద్య సేవలు అందించారు. 22 మందికి ములుగు టిహా బ్ వారు, రక్త నమూనాలను సేకరించినారు. ఈ కార్యక్రమంలో రాయిని గూడెం MLHPS, ఆరోగ్య విస్తరణాధికారి జె. సురేష్, సూపర్వైజర్స్ దేవేందర్, మేరీ, వసంతకుమారి, ఉమారాణి ,ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన చిన్నారెడ్డి

**- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం**



వనపర్తి, నవంబర్ 18 ((తీన్మార్ న్యూస్): వనపర్తి నియోజకవర్గంలోని తాడిపర్తి, బుద్ధారం, చాకలి పల్లి గ్రామాలలో సోమవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు సీనియర్ మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్, వరి ధాన్యము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ,ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం గా ఈ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ఇప్పటివరకు 18 వేల కోట్ల రూపాయలు చేసిందని త్వరలోనే మిగతా 12 వేల కోట్ల రూపాయలను పంట రుణమాఫీ కోసం ఖర్చు చేసి సంపూర్ణంగా రుణమాఫీ చేస్తామని రైతు భరోసా పథకం కింద రైతులకు ఇవ్వాల్సిన ?7500 నిధులు కూడా ఈ నెలలో ప్రభుత్వం రైతుల అకౌంట్లో జమ చేస్తుందని ఆయన వెల్లడించారు, అంతేకాక రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు వరి ధాన్యం సన్న వరి ధాన్యం పై క్వింటాలకు 500 రూపాయల బోనస్ కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని గ్రామాలలో ఏర్పాటుచేసిన ఐకెపి కేంద్రాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఎక్కడ చూసినా రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ తమ పండించిన పంటను తరలిస్తున్నారని అన్నారు, ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం డబ్బులను రైతులు అకౌంట్లో వెంటనే వేస్తున్నామని చిన్నారెడ్డి తెలిపారు, అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తీసుకు వస్తున్న వరి ధాన్యంతో పాటు వేరుశనగ పంటకు గిట్టుబాటు ధరతో పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ధాన్యం ఎక్కడ కూడా జాప్యం చేయకుండా కొనుగోలు జరుగుతుందని పేర్కొన్నారు, మార్కెట్ యార్డులో రైతులకు ఇతర వసతులతో పాటు ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఆటంకం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో గోపాల్పేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్య శిలా రెడ్డి, డిఆర్డిఏ అధికారి అరుణ వివిధ గ్రామాల మాజీ సర్పంచ్లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు**




ములుగు జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్ కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రెవిన్యూ శాఖ – 13, పెన్షన్లు – 2, ఇందిరమ్మ ఇళ్ల – 1, ఉద్యోగ ఉపాధి కొరకు – 1, ఇతర శాఖలకు సంబంధించినవి – 9, మొత్తం 26 దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల ఇంచార్జీ సంపత్ రావు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు సమావేశ మందిరంలోనే అందించారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ ఎన్. గోపాల్ రావు, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సి కార్పొరేషన్ ఈ డి తుల రవి, విద్యుత్ శాఖ డిఈ ఇంచార్జీ సదానందం, డి ఎ ఓ తేజోవతి, డి డబ్లుఓ ఇంచార్జీ శిరీష, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాతృ మరణాలను తగ్గించాలి





**- డాక్టర్ జి మురళీధర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి**

మహబూబాబాద్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మెటర్నల్ డెత్ సమీక్షా సమావేశం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్ ఆధ్వర్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కురివి మరియు తొర్రూరు వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాల రేటు తగ్గించాలని, మరణాలు జరగకుండా, గర్భిణీ స్త్రీల నమోదు మొదలుకొని, ప్రసవం అయ్యేవరకు ఆరోగ్య సేవలు అందించా లని, గర్భిణీ స్త్రీలు, రక్తహీనత లేకుండా, పౌష్టికాహారం తీసుకునే లాగా, కమ్యూనిటీలో అవగాహన కల్పించాలని, రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ టాబ్లెట్స్ అందించాలని కోరడం జరిగింది. గర్భిణీ స్త్రీల నమోదు 12 వారాల్లో జరగాలని, మొదటి రెండు చెక్కపులు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చే పరీక్ష చేయించుకోవాలని, మూడు నాలుగు చెకప్పులు జిల్లాలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో చూయించుకోవాలని, గర్భిణీ స్త్రీల రవాణాకు 102 వాహనాన్ని వినియోగించుకునేలాగా అవగాహన కల్పించాలని పేర్కొనడం జరిగింది.సాధారణ ప్రసవా లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేయాలని, సిజేరియన్ ఆపరేషన్ల ను తగ్గించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో ప్రమీల, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, కె.వి.రాజు హెల్త్ ఎడ్యుకేట ర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, రుక్మొద్దీన్ డిపిఎం, ఎల్ డి కంప్యూటర్ మనోహర్ వైద్యాలు ,ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

# మాటలకే పరిమితమైన ముఖ్యమంత్రి, మంత్రులు

**- వారంలోపే ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామంట్టిరి ఏవి డబ్బులు?**


**- జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు**



చిన్నకోడూర్, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): వడ్లు తూకం వేసిన వారంలోపే రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామన్న ప్రభుత్వం నేటి కూడా రైతు ఖాతాలో డబ్బులు జమ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య అల్లిపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కుంభాల చంద్రశేఖర్లు అన్నారు. చిన్నకోడూరులో ప్రెస్ నోట్ విడుదల చేసి మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా పూర్తి రుణమాఫీ ఇవ్వకుండా ఎగనామం పెట్టాలని ఇవాళ రేవంత్ ప్రభుత్వం చూస్తుందని రైతులు పండించిన ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పిన రేవంత్ రెడ్డి ఈ సీజన్లో కొన్ని గ్రామాలలో కేవలం ముహూర్తాలు మాత్రమే చేసి వడ్లు తూకం వేయకుండా కాలయాపన చేయడం వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని మండిపడ్డారు రేవంత్ ప్రభుత్వం ఏర్పడ్డాక బిఆర్ఎస్ నాయకులైన కెసిఆర్ హరీష్ రావు కేటీఆర్ లను విమర్శిస్తూ కాలయాపన చేయడం తప్ప ప్రజలకు మీరు ఈ పది నెలల్లో చేసింది ఏమిటంటే వారు మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచిపోయిన రైతులకు పూర్తి రుణమాఫీ చేయలేదు రైతు భరోసా ఇవ్వలేదు పెన్షన్ 4000 కాలేదు కళ్యాణ లక్ష్మి ఊసే లేదు మహాలక్ష్మి కింద 2500 ఇవ్వలేదు ఇలా చెబుతూ పోతే మీ గ్యారెంటీలు గాలికి పోయిన తప్ప చేసింది ఏమీ లేదని అధికారిని అడ్డుపెట్టుకొని బెదిరింపులకు దిగుతున్నారు తప్పితే ప్రజా శ్రేయస్సు మీకు ఏమాత్రం పట్టడం లేదని వారు అన్నారు ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిచేది బిఆర్ఎస్ అని వారు అన్నారు.


# ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చేయాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి నుండి కూడా జిల్లాకు సంబంధించి నటువంటి దరఖాస్తులు రావడం జరుగుతుందని అట్టి దరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించి ప్రజావాణి వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు వారి వారి కార్యాలయం పరిధిలో ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి అందచేసిన దరఖాస్తుదారునికి సమస్య పరిష్కార స్వభావంపై లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం చాలా ముఖ్యమైనదని దరఖాస్తులు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. నేడు జిల్లా నలుమూలల నుండి 52 మంది ప్రజావాణిలో తమ సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారు





హన్మకొండ జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నేడు వరంగల్ లో నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొంటారు. మధ్యాహ్నం 2:30 కు ముఖ్యమంత్రి హన్మకొండ కుడా గ్రౌండ్స్ హెలిపాడ్‌కు చేరుకుంటారు. ముందుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవం లో పాల్గొని ఆర్ట్ గ్యాలరీని సందర్శిస్తారు. 3 గంటలకు ఆర్ట్స్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన విజయోత్సవ వేదికకు చేరుకుంటారు. 3:20 కి అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించి.. మహిళా స్వయం సహాయక సంఘాలు, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య సభ్యులతో ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల కు ముఖ్యమంత్రి అక్కడే శంకుస్థాపన చేస్తారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా బ్యాంక్ లింకేజ్ చెక్కులు, బీమా చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం వేదికపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

# రూ.2.48 కోట్ల గంజాయి కాల్చివేత

**54 కేసుల్లోని 993 కేజీల గంజాయి దాహనం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ఖమ్మం జిల్లా కొత్తగూడెం, పాల్వంచ, మణుగూర్, యేల్లెందు , అశ్వరావు పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల లోపట్టుబ డిన 993 కేజీల గంజాయిని సోమవారం కాల్చి వేశారు. ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ జనార్ధన్ అదేశాల మేరకు 54 కేసుల్లో పట్టుబడిన గంజాయిని దాహనం చేశారు. కాల్చివేనిన గంజాయి విలువ రూ. 2,48,25,000 ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని తల్లేడ మండలం, గోపాల్‌పేట్ గ్రామంలో ఉన్న %రూఔవీ% కన్సటింగ్ లిమిటేడ్‌లో దగ్ధం చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 25 కేసుల్లోని 337.790 కేజీల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 15 కేసుల్లోని 408.371 కేజీల గంజాయిని, మణుగూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 52.520 కేజీల గంజాయిని, యేల్లెందు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 10 కేసుల్లోని 108.372 కేజీల గంజాయిని, ఆశ్వరావుపేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 37.500 కేజీల గంజాయిని దాహనం చేయించినట్లు డిప్యూటి కమిషనర్ తెలిపారు. గంజాయిని దాహనం చేస్తున్న సమయంలో డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టేంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపరిండెంట్ జానయ్యతో పాటు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సీఐలు పాల్గన్నారు. ఒకవైపు గంజాయిని పట్టుకుంటూనే మరో వైపు పట్టుకున్న గంజాయిని కాల్చి వేయిస్తున్న ఖమ్మం జి ల్లా ఎక్సైజ్ అధికారులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

# ఇందిరా మహిళా శక్తి మేళ ప్రారంభం

హన్మకొండ జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ,సెర్ప్ సీఈఓ దివ్య దేవరాయన్, హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారదాలతో కలసి సోమవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి మేళాను ప్రారంభించారు. ఇందులో భాగంగా సెర్ప్,మెప్మా ద్వారా 20 స్టాల్స్ ఏర్పాటు చేసి ఈ స్టాల్స్ లో దాదాపు 40 రకాల వివిధ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఇందులో సెర్ప్ నుండి 28, మెప్మా నుండి 12 రకాల ఉత్పత్తులు ఉన్నాయి. జనగాం జిల్లా కి సంబందించిన పెంబర్తి హస్త కళా వస్తువులు, నారాయణ్ పేట్ నుండి చీరలు, టెర్రకోట జ్యువలేరి, హ్యాండ్లుమ్స్, భూపాలపల్లి నుండి దస్త్రి పట్టు వస్తువులు, చేర్యాల నుండి నకశి పెయింటింగ్స్, యాద్రాద్రి నుండి పోచంపల్లి , ఇక్కత్ వస్త్రాలు ఇలా వివిధ జిల్లాలకి చెందిన గుర్తింపు పొందిన ఉత్పత్తులను ఈ స్టాల్స్ లో ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళా స్వశక్తి సంఘాల సభ్యులచే తయారయ్యే



విభిన్న ఉత్పత్తుల స్టాళ్ల ను సందర్శించి చేనేత వస్త్రాలు, వివిధ సౌందర్య ఉత్పత్తులు, పసుపు మసాలా ఉత్పత్తులను పరిశీలించారు. ఈ మేళాను సందర్శించి వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రజలు నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత పరిశ్రమ, వివిధ రకాల సౌందర్య ఉత్పత్తులను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ, సెర్ప్, మహిళ శక్తి స్వయం సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి దళారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి

**- వెంటనే దళారుల కొనుగోలు కేంద్రాలను మూసివేయాలి**

**- పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కి వినతి పత్రం**

**- బిఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్**

శాయంపేట, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): శాయంపేట మండలం కేంద్రంగా పత్తి దుకాణాలు ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన ప్రత్తిని కొంతమంది దళారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, అక్రమ కాంటాలు పెడుతూ, తక్కువ ధరకు ప్రత్తిని కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని బహుజన సంక్షేమ సంఘం (బిఎస్ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్ పరకాల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ (బుజ్జన్న) కి వినతి పత్రం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ శాయంపేట మండల కేంద్రంలో పత్తి కొనుగోలు దళారులు రైతులు ఆరుకాలం కష్టపడి ఎండనక వాననక శ్రమించి పండించిన పంటను అమ్ముకుందామని అనుకుంటే ఈ దళారులు రైతులను మభ్యపెడుతూ రైతులను మోసం చేస్తున్నారని వాపోయారు. రైతులు అప్పులు తెచ్చుకొని పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తే రైతులను దళారులు తూకంలో మోసం చేస్తున్నారని, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకుండా వారిని ఆర్థికంగా నష్టపరుస్తున్నారని తెలియజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన 7121 రూపాయల ధర కంటే 5800 నుండి 6200 తక్కువ ధరకు రైతు దగ్గర నుంచి ప్రత్తిని కొనుగోలు చేస్తున్నారని, వారిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిపారు. దళారుల ఆగడాలకు హద్దు అదుపు లేకుండా ప్రభుత్వ నిబంధనలు వారికి



అవసరం లేదన్నట్టుగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. రైతు రాజు కావాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటే, ఇలాంటి దళారులు రైతులను ఎలా మోసం చేయాలో పనిగట్టుకుని ఉన్నాయని వైస్ చైర్మన్ కి తెలిపారు. కాంట వేసే సమయంలో ప్రతి క్వింటాకు రెండు నుంచి ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఇది మంచి పరిణామం కాదని ఆ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అని అన్నారు. తక్షణమే ఈ విషయంపై స్పందించి, ఈ దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులను అదుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ విషయంపై స్పందించిన వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ (బుజ్జన్న) సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# ప్రజా పాలన - విజయోత్సవాల వేడుకలను విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం ఏర్పడి తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు చేపట్టిన కార్యక్రమాలు వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళుటకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఈనెల 19న వరంగల్ లో నిర్వహించు ప్రజా పాలన - విజయోత్సవాల వేడుకలకు జిల్లా నుండి మహిళా సంఘాల మహిళలను భాగస్వాములు చేయుటకు గాను చేయాల్సిన ఏర్పాటలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో ఎంపీడీవోలు, ఆర్టీసీ అధికారులు మరియు సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 19వ తారీఖు వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమానికి మరియు ప్రజా పాలన విజయోత్సవ వేడుకలకు జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళలను తీసుకువెళ్లాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళా సంఘాల సభ్యులను ప్రజా పాలన విజయోత్సవాల వేడుకలకు హాజరు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. జిల్లా నుండి 12 బస్సుల్లో బస్సు కు 45 మంది చొప్పున 540 మంది మహిళలను కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. దూరంగా వున్న మండలా బస్సులు ఉదయం ఏడు గంటలకు, మిగిలిన మండలాల బస్సులు ఎనిమిది గంటలకు మండల కేంద్రం నుండి బయలుదేరాలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళలందరికీ ఐడీ కార్డులు అందించాలని, అదేవిధంగా ప్రతి ఐడి కార్డు వెనకాల సంబంధిత ఏపిఎం ఫోన్ నెంబర్లు ఉండాలని అధికారులను సూచించారు. కార్యక్రమానికి



హాజరైన మహిళలకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. బస్సుల్లో మహిళల కు త్రాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని బస్సులు ఒకే రూట్లో వరంగల్ చేరుకునేలా రూట్ మ్యాప్ ను సిద్ధం చేయాలన్నారు. బస్సులన్నిటికీ బ్యానర్లు సిద్ధం చేయాలి అన్నారు. మహిళలకు నర్సంపేటలో మధ్యాహ్నం మరియు రాత్రి భోజనం సౌకర్యాలు ఏర్పాటు చేయాలని దానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళల అందరి వివరాలు మరియు ఫోన్ నెంబర్లు నమోదు చేయాలన్నారు. అన్ని మండలాల్లోనే ఏపీఎంలు తమ పరిధిలోని ఉత్సాహవంతులైన మహిళా గ్రూపు సభ్యులను గుర్తించి ఈ కార్యక్రమానికి తీసుకురావాలని అన్నారు. మహిళలు కేవలం కార్యక్రమంలో పాల్గొనటం మాత్రమే కాకుండా అక్కడ వివిధ జిల్లాలువారు ఏర్పాటుచేసిన స్టాల్ లను చూడడం ద్వారా మన జిల్లాలో కూడా ఆ ఆలోచన లు అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆర్టీసీ అధికారులను మహిళల తరలింపుకు అవసర మైన బస్సుల వివరాలు అందించాలని ఆదేశించారు. అన్ని మండలాల ఏపిఎంలు మరియు సీసీలు కార్యక్రమం అనంతరం మహిళలు ఎవరు మిగిలిపోకుండా అందరిని గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలుచేపట్టాలని ఆదేశించారు. మహిళలు గమ్యస్థానం చేరుకునేంతవరకు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మహిళలందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

# జిల్లాలో సజావుగా గ్రూప్-3 పరీక్ష

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్**

జనగామ జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): సోమవారం, జిల్లాలో గ్రూప్-3 పరీక్ష (పేపర్-1, 2, 3) సజావుగా జరిగాయని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఓఎంఆర్ జవాబు పత్రాలను పోలీసుల పర్యవేక్షణలో ప్రభుత్వ వాహనంలోకి ఎక్కించి, సీల్ వేసి అత్యంత జాగ్రత్తగా హైదరాబాదులోని టీజీపీఎస్సీ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, డీఈఓ రాము, సంబంధిత అధికారులు, పోలీసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్ళ వివరాలను సక్రమంగా నమోదు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్**

జనగామ జిల్లా, నవంబర్ 18 (తీన్మార్ న్యూస్): సోమవారం, జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల, పటేల్ గూడెం, నవాబుపేట అలాగే దేవరుప్పుల మండలంలోని చిన్నమడ్డూర్, సింగరాజుపల్లె, దేవరుప్పుల, కొత్తవాడ గ్రామ పంచాయతీలలో ఐకేపీ, పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ళ రిజిస్టర్ లను తనిఖీ చేసి, ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యం కేంద్రానికి తీసుకొచ్చిన వెంటనే తూకం జరిపించాలని, ధాన్యం బస్తాల లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత మిల్లులకు తరలించాలని సూచించారు. అదే విధంగా ధాన్యం కొనుగోళ్ళ వివరాలను



ఎప్పటికప్పుడు సరైన విధంగా ఓపీఎంఎస్ లో నమోదు చేయాలన్నారు. తద్వారా రైతుల ఖాతాల్లోకి సకాలంలో కొనుగోలు నగదు జమవుతుందని తెలిపారు. ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ వెంట డీటీ సీఎస్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేక కమిషన్

నల్లగొండ: స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు ఎలా ఉండాలనే దానిపై హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటైనట్టు రాష్ట్ర వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మెన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు సంబంధించి బీసీ కుల సంఘాలు, ఇతర సామాజిక సంఘాల నేతలు, వ్యక్తులు, సంస్థల ద్వారా స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామాషాపై అర్జీలను, విజ్ఞాపన పత్రాలను స్వీకరించి ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. అనంతరం కమిషన్ చైర్మెన్ మాట్లాడుతూ.. రెండు వారాల కిందటే రాష్ట్ర డెడికేషన్ కమిషన్ ఏర్పాటైందని, స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు ఎంత ఉండాలో పేర్కొనే విషయమై చర్చ నడుపుతామని అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో అభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఈ అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా ప్రజాభిప్రాయ సేకరణలో ఎక్కువ మంది నుంచి.. జనాభాలో బీసీల శాతాన్ని బట్టి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలనే విజ్ఞాపనలు వచ్చాయని చెప్పారు. అదేవిధంగా పని కులాలను ఏ బీ సీ డీ గా విభజిస్తే బాగుంటుందని సూచించారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని కులాలకు అవకాశాలు కల్పించాలని, సమగ్ర సర్వే తదితర అంశాలకు సంబంధించి విజ్ఞాపనలు వచ్చాయని అన్నారు.

**విజ్ఞాపన పత్రాలు, దరఖాస్తుల స్వీకరణ**

జిల్లా కలెక్టర్ ఛాంబర్లో స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామాషా పేర్కొనే విషయంపై విజ్ఞాపన పత్రాలు, దరఖాస్తులను స్వీకరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, సమాచార హక్కు పరిరక్షణ



కమిటీ చైర్మెన్ కేశవులు, నాయి బ్రాహ్మణ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ, ముదిరాజ్ సంఘం, పూసల సంఘం, వడ్డెర సంఘం, చేతివృత్తులు, కుల సంఘాలు, కుమ్మరి, యాదవ, ముదిరాజ్, రజక సంఘాలు విజ్ఞాపన పత్రాలు అందించాయి. రిజర్వేషన్ సీలింగ్ ఎత్తేయాలని, మహిళల్లో అత్యంత పేదవారికి మాత్రమే రిజర్వేషన్ కల్పించాలని కోరాయి. ఈబీసీ 10శాతంపై వచ్చిన 108 సవరణను రద్దు చేయాలని పలువురు నేతలు కోరారు. డెడికేటెడ్ కమిషన్ చైర్మెన్ భూసాని వెంకటేశ్వరరావుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ తదితరులు పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. కమిషన్ కార్యదర్శి బి.సైదులు, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములు నాయక్, డీఆర్ఓ అమరేందర్, ఆర్డిఓ అశోక్ రెడ్డి, నల్లగొండ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నజీమ్ అలీ, యాదాద్రి భువనగిరి జిల్లా బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, సూర్యాపేట బీసీ సంక్షేమ అధికారి అనసూయ,రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజ్‌కు ప్రయత్నాలు

**- త్వరలో ఉద్యోగులతో చర్చలు : ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్**

**- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా**

ముషీరాబాద్: ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పారు. శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమం వల్ల సమయం లేకపోవడంతో మాట్లాడలేకపోతున్నామని, త్వరలో ఉద్యోగస్తులను పిలిచి చర్చించి.. సత్వరమే చర్యలు తీసుకొని రెగ్యులరైజేషన్ చేయడమే కాకుండా ఇతర అంశాలను ప్రకటించనున్నట్టు తెలిపారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతున్నట్టు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాక.. దాన్ని కేంద్రం అంగీకరిస్తూ సవరణ చేసి అదనపు నిధులు విడుదల చేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ నిరంతరం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. క్రమబద్ధీకరణకు కేంద్రంతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకుంటామని, ఉద్యోగ భద్రతకూ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. లేదంటే ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. క్రమబద్ధీకరణ సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కు అన్నారు. 15 నుంచి 18 ఏండ్లపాటు వారు సేవలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం




లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయకుంటే పోరాటాలు చేస్తామన్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దుండిగల్ యాదగిరి దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలన్నారు.

ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి అనేకమార్లు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఒక్క హామీ అమలు చేయలేదని, వెంటనే ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, కార్యనిర్వాహక అధ్యక్షులు వి.అనిల్ చారి, కోశాధికారి దుర్గం శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లేష్, సురేందర్, సహదేవ్, క్రాంతి కుమార్, ముఖ్య సలహాదారులు శ్రీధర్‌రెడ్డి, మెహబూబ్ పాషా, ఉపాధ్యక్షులు ఎస్కే ఖాదర్, ఫాతిమా, యాదగిరి, రమేష్ జానకి పాల్గొన్నారు.

# సర్వే 82% విజయవంతంగా పూర్తి: ఎంపీడీఓ

ధర్మారం : సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా 82% విజయవంతంగా పూర్తి చేశమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ ఐనాల ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐనాల ప్రవీణ్ కుమార్ మండలంలోని ఖిల్లంరెడ్డిపల్లి, ఖమ్మరిఖాణ్ పేట, నాయకంపల్లి, పత్తిపాక, ప్రకాష్ నగర్, మల్లాపూర్ తదితర గ్రామ పంచాయతీలలో సర్వే ప్రక్రియను ఆకస్మికంగా పర్యవేక్షించి ఎలాంటి తప్పులు దొర్లకుండా అన్ని కాలమ్స్ ను సర్వే బుక్లెట్ లో ఇచ్చిన కోడ్స్ ప్రకారం కుటుంబానికి సంబందించిన అన్ని వివరాలను పూర్తిగా సేకరించాలని అన్నారు. ఈ సందర్బంగా సంబందింత ఎన్యూమరేటర్లకు ఆయన సూచించారు. మండలము 82.17 శాతము సర్వే పూర్తి అయినట్లు తెలుపుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తి అయిన సర్వే ఫారాలను సంబంధిత



సూపరవైజర్ల ద్వారా మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని సర్వే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీల్లో ముగిసిన పీజీ ప్రవేశాలు

**- గణనీయంగా పెరిగిన గర్ల్స్ ప్రవేశాలు**
**- అందరి చూపు ఓయూ వైపే**
**- 8 యూనివర్సిటీల్లో సగం సీట్లే ప్రవేశాలు..**



ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీజీఈటీ-2024), అడ్మిషన్స్ ప్రక్రియ ఇటీవలే ముగిసింది. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం, పాలమూరు, కాకతీయ, శాతవాహన, చాకలి ఐలమ్మ, మహాత్మాగాంధీ, తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో మొత్తం 45 పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు నిర్వహించారు. కాగా, ఈ 8 యూనివర్సిటీల్లో మొత్తం 47,722 సీట్లు ఉండగా వాటిలో 21,170 సీట్లు మాత్రమే ప్రవేశాలు తీసుకున్నారు. మరో 23 వేల పీజీ సీట్లు ఖాళీగా ఉన్నాయి. అడ్మిషన్స్ పొందిన వారిలో 15,712 మంది అమ్మాయిలు, 5,458 మంది అబ్బాయిలు ఉన్నారు. గత ఐదేండ్ల నుంచి పీజీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడం నుంచి అడ్మిషన్ల వరకు అమ్మాయిలే ముందు వరుసలో ఉన్నారు. ఈ సంఖ్య ప్రతిఏటా పెరుగుతోంది.ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలో.. 20వరకు స్పాట్ అడ్మిషన్స్ ఇక పీజీ కోర్సుల్లో భారీగా సీట్లు మిగిలి ఉండటంతో ఈ నెల 20వ తేదీ వరకు మెరిట్ కలిగి ఉన్న విద్యార్థులు అఫ్లియేటెడ్ (ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో) కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్స్ పొందవచ్చునని కన్వీనర్ ప్రొఫెసర్ ఐనవోలు పాండు రంగారెడ్డి తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్టు చెప్పారు. పూర్తిస్థాయి వివరాల కోసం ఓయూ, సీపీజీఈటీ వెబ్‌సైట్లలో చూడాలని కోరారు. ఇలా స్పాట్ అడ్మిషన్స్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్స్‌ను సంబంధిత కళాశాలల వారు కన్వీనర్‌కు 26వ తేదీవరకు సబ్మిట్ చేయాలని, వాటిని పరిశీలించి సర్టిఫై చేసి అప్రూవల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. కాగా,ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీట్లు పొందటానికి 80శాతం మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం.

# మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205 కోట్లు

**-- జీవో విడుదల చేసిన ప్రభుత్వం**
**- డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు**




వరంగల్ : మామునూరు ఎయిర్‌పోర్టును పునరుద్ధరించ డానికి అవసరమైన 253 ఎకరాల భూమిని సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖను ఆదేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. దాంతో మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముందడుగు పడ్డట్టయింది. ఇటీవల విమానాశ్రయం పునరుద్ధరణకు అవసరమైన 253 ఎకరాలను సేకరించడానికి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ గుంటూరుపల్లి గ్రామంలో గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లి గ్రామ రైతులతో సమావేశాన్ని నిర్వహించిన విషయం విదితమే. కాగా, ఇప్పటివరకు మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ సాధ్యమవుతుందో లేదోనన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవడం పట్ల ఉమ్మడి వరంగల్‌లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది.

మూడు గ్రామాల్లో 253 ఎకరాలు: మామునూరు విమానాశ్రయానికి 950 ఎకరాల భూమి అవసరముండగా, ప్రస్తుతం 693 ఎకరాల భూమి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధీనంలో ఉంది.. మరో 253 ఎకరాల భూమి అవసరముండగా, ఖిలావరంగల్ మండలంలోని గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో ఈ భూమిని సేకరించనున్నారు. నక్కలపల్లిలో 43 ఎకరాలు, సంగెం మండలంలోని గుంటూరుపల్లిలో 185 ఎకరాలు, గాడిపల్లిలో 25 ఎకరాలను రైతులు కోల్పోతున్నారు. గాడిపల్లి గ్రామంలో 12 ఇండ్లు, ఒక చెరువు కూడా భూ సేకరణలో పోనుంది. వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువును ప్రత్యామ్నాయంగా మరో స్థలంలో నిర్మించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అంగీకరించారు. చెరువు కింద ఉన్న 100 ఎకరాల ఆయకట్టులో 25ఎకరాల ఆయకట్టును రైతులు విమానాశ్రయం కింద కోల్పోతున్నారు.

# కోట్ల రూపాయిల నోట్ల కట్టలు

చెన్నై: ఓ లాటరీ కింగ్‌పై మనీలాండరింగ్ అభియోగాలకు సంబంధించి రంగంలోకి దిగిన ఈడీ అధికారులు అతని ఇంట్లో సోదాలు నిర్వహించగా కోట్లాది విలువైన ఆస్తులు, నగదు బయటపడింది. లాటరీ వ్యాపారాలు చేస్తూ కోట్లలో ప్రభుత్వానికి నష్టం కలిగించడంతో పాటు.. వ్యాపారాల్లో పలువురిని మోసం చేశారన్న అభియోగాలు కూడా ఉండగా పోలీసులు కూడా ఫిర్యాదులు అందాయి. విచారణ చేపట్టిన పోలీసులు ఆధారాలు లేవంటూ కేసులు క్లోజ్ చేశారు. లాటరీ కింగ్ గా పిలవబడే అతగాడిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదులు అందడంతో రంగంలోకి దిగిన అధికారులు అతని బండారం మొత్తం బయట పెట్టారు. ఇంతకీ ఎక్కడ జరిగింది? ఎవరా లాటరీ కింగ్ ?లాటరీ వ్యాపారం గురించి చాలామందికి తెలుసు కాకపోతే అవి కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమల్లో ఉంది. దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో జరిగే లాటరీ విక్రయాలు ఎక్కువగా కేరళ సిక్కింలలో జరుగు తుంటాయి.. ఈ రెండు రాష్ట్రాల్లో జరిగే లాటరీ వ్యాపారం.. ప్రతి ఏటా వందల కోట్లలోనే ఉంటుంది.. ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించి జరిగిన వ్యాపారాల్లో అవకతవకలపై విచారణ జరిగితే డొంక తమిళనాడులో ఉన్నట్టు తెలిసింది. శాంటియాగో మార్టిన్ ఇతను లాటరీ వ్యాపారంతో మొదలై దాని ద్వారా వచ్చిన ఆదాయంతో అనేక వ్యాపారాలు మొదలుపెట్టారు. టెక్స్‌టైల్ రంగం సహా గేమింగ్ వ్యాపారాల్లో కూడా భాగస్వామిగా ఉన్న మార్టిన్ లాటరీ వ్యాపారం పేరుతో మోసపూరితంగా వ్యవహరించి రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికి గండి కొట్టారని ఆరోపణలు ఉన్నాయి. మార్టిన్ చేసే లాటరీ దందా ద్వారా సిక్కిం ప్రభుత్వానికి దాదాపు 900 కోట్ల నష్టం వాటిల్లిందని అక్కడి ప్రభుత్వమే అభియోగాలు చేసింది. ప్రభుత్వానికి తెలియకుండా సమాంతరంగా మరో వ్యవస్థను ఏర్పాటు చేసి లాటరీ వ్యాపారం చేస్తూ వందల కోట్లు అక్రమంగా వెనకేసారన్న ఆరోపణలు ఉన్నాయి. మార్టిన్ పై తమిళనాడులోని కోయంబత్తూర్ తో పాటు పలు నగరాల్లో పోలీస్ కేసులు ఉన్నాయి. అయితే ఈ కేసుల్లో ఏవి కూడా విచారణ పూర్తిగా కాలేదు. సరైన ఆధారాలు లేవంటూ దాదాపు క్లీన్ చిట్ ఇచ్చినట్టుగా పోలీసులు కేసులను మూసివేశారు. మద్రాస్ హైకోర్టు ఆదేశాలతో ఈడీ రంగంలోకి దిగి సోదాలు చేపట్టింది. దీంతో సిక్కిం ప్రభుత్వం, అలాగే పలు రాష్ట్రాల్లో ఆయనపై వచ్చిన ఫిర్యాదు లతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నేరుగా రంగంలోకి దిగింది. చెన్నైలో గత నాలుగు రోజులుగా చేసిన సోదరులు కోట్ల విలువైన ఆస్తులు బయట పడ్డాయి. నివాసం కార్యాలయాల్లో 8.8 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్టిన్ అతని అల్లుడు యాదవ్ అర్జున్ వారి సహచరుల ఇండ్లపై దాదాపు 20చోట్ల సోదాలు జరగగా రాజకీయ పార్టీలకు దాదాపు 1300 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను ఇచ్చినట్లుగా గుర్తించారు. పంజాబ్ ఇచ్చిన ఫిర్యాదుతో 2023లో ప్రభుత్వానికి 900 కోట్ల నష్టం వాటిల్లిన కేసులో మార్టిన్‌కు చెందిన 450 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. మార్టిన్ పై ఇప్పటివరకు కేవలం సిక్కిం ప్రభుత్వానికి నష్టం వాటిల్లిన కేసు అలాగే తమిళనాడు లో పలువురు వ్యాపారస్తులు తమను మోసం చేసిన కేసుల్లో మాత్రమే ఇతని అక్రమాలు ఇప్పటివరకు వెలుగు చూశాయి.విచారణ జరిగితే లాటరీకింగ్‌గా పిలువబడే మార్టిన్ అక్రమాలు ఇంకెన్ని బయటపడతాయో చూడాలి.

# ఈవీలకు బంపర్ ఆఫర్

**- పాలసీ ప్రకటించిన రవాణామంత్రి పొన్నం**



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) పలు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ వివరాలను తెలిపారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు. ఫోర్ వీలర్స్, ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాలు, ట్రై గూడ్స్ వాహనాలకు ఎలాంటి ట్యాక్స్‌లు ఉండబోవని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ నూతన ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 2026 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, ఆర్టీసీ, ప్రయివేటు ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తే వందశాతం పన్ను మినహాయింపులు ఉంటాయని వివరించారు. ఈ మేరకు జీవో నెంబర్ 41 జారీ చేశామన్నారు. ఈ పాలసీ రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుందన్నారు. సోమవారం నుంచే ఈ పాలసీ అమల్లోకి వస్తుందనీ, ఎలక్ట్రిక్ వాహనాలకు ఎలాంటి పరిమితి లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణ కోసం మూడు వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇప్పటి వరకు పరిమిత సంఖ్యలోనే ఎలక్ట్రిక్ వాహనాలు వాడుతున్నారనీ, ఈ సంఖ్యను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు ఈవీ వాహనాల కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 15 ఏండ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేసేందుకు ప్రత్యేక పాలసీ తెచ్చామని గుర్తుచేశారు. పాత వాహనాలను ఆ పాలసీ ద్వారా స్క్రాప్ చేస్తే, ప్రోత్సాహకాలు లభిస్తాయని చెప్పారు. దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల వల్ల 1 లక్ష 50 వేల మంది చనిపోతున్నారనీ, రాష్ట్రంలో రోజుకు 20 మంది చనిపోతున్నారని వివరించారు. రోడ్డు భద్రతపై లైసెన్స్ ఇచ్చేముందు అవగాహన కల్పించాలని గురువారెడ్డి సంస్థ సిఫార్సు చేసిందనీ, దాన్ని అమలు చేస్తామన్నారు. యునిసెఫ్ ద్వారా పాఠశాలల్లో అవగాహనా పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రవాణాశాఖకు కొత్త లోగో, కొత్త వాహనాలు వస్తాయనీ, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఎన్‌ఫోర్స్ మెంట్ ట్రాఫిక్ పోలీసుల మాదిరే వాహనాల తనిఖీలు చేస్తారని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో 5వేల ఈవీ వాహనాలకు మాత్రమే వర్తించే లా పన్ను మినహాయింపులు ఇచ్చారనీ, ఇప్పటి వరకు లక్షా 70వేల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయని చెప్పారు. తాము ఈ పరిమితిని ఎత్తేస్తున్నామన్నారు. పొల్యూషన్ చెకప్ చేసే వాహనాలు సరిగా పనిచేయట్లే దనీ, అందుకే ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్స్ తీసుకొస్తున్నామన్నారు. సమావేశంలో రవాణాశాఖ కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

**డిసెంబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**
**ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మరియు మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం సభలో ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి , కే ఆర్ నాగరాజు పిలుపు.**

ఖమ్మం : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మరియు మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం సభ కు ముఖ్యఅతిథిగా చెల్లూరు ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి , వర్ధన్నపేట ఎమ్మెల్యే మరియు తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషయిన్ అఫ్ మాల టీం రాష్ట్ర అధ్యక్షులు కే ఆర్ నాగరాజు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య లు హాజరైనరు . ఈ సభకు అధ్యక్షులుగా పల్లా రాజశేఖర్ అడ్వకేట్, కన్వీనర్ గుంతేటి వీరభద్రం వహించారు.దీనిలో మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ డి సర్వైయ్య, సమతా సైనిక్ దళ్ దేశ ఉపాధ్యక్షులు దిగంబర్ కాంబ్లే , టీం రాష్ట్ర కార్యదర్శి మేకల రవీందర్ , డాక్టర్ గోపీనాథ్ ,భీమ్ ఫౌండేషన్ అధ్యక్షులు మందాల భాస్కర్ ,ప్రముఖ గాయకులు రెంజర్ల రాజేష్ , పిల్లి బాలరాజు, తలమల హుస్సేన్ , ఉద్యోగుల సంఘం నాయకులు , జంగం లక్ష్మణరావు , ముత్తమాల ప్రసాదు కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహరించినారు . స్వర్ణకుమారి , విజయలక్ష్మి,డాక్టర్ బాబు రత్నాకర్ తదితరులు హాజరయ్యి ప్రసంగించినారు .ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూల నుండి పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నాయకులు హాజరైనారు . వీరితో పాటు వివిధ ప్రాంతాల నుండి మాల మహానాడు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరైనారు . మాలల ఆత్మగౌరవం కోసం ఈ యొక్క కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మాల అస్తిత్వానికి దెబ్బగా ఉండే కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండి చైతన్యవంతమై,శక్తిని నిరూపించుకొని , మనకు రావాల్సిన హక్కులు సాధన కొరకు పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమం ఎవరికీ వ్యతిరేకం కాదని కేవలం మాలలు ఆత్మగౌరవం కోసమే ఉద్యమించాలని పలువురు తెలియజేశారు.దీనిలో జగన్ సాయి బాబ, సురేష్ , కృష్ణ శ్రీనివాస్ మొదలకు వారు హాజరైనారు

# తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**-పెద్దపల్లి అదనపు కలెక్టర్ డి.వేణు**



మంథని: మండలంలో కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మంథని వ్యవసాయ మార్కెట్ యార్డు, మంథని మండలం ఏక్లాస్ పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం తేమ శాతం రెగ్యులర్ గా చెక్ చేయాలని, 17 శాతం తేమ రాగానే వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. కొనుగోలు చేసిన వడ్ల వివరాలను వెంటనే ఓపిఎంఎస్ లో నమోదు చేస్తూ రైతులకు త్వరగా ధాన్యం డబ్బుల చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. మద్దతు ధర పై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలులేదని అదనపు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాల దృష్ట్యా పంట నష్టపోకుండా అవసరమైన టార్పాలిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**- వాల్ పోస్టర్ ఆవిష్కరణలో..**
**సీపీఐ(ఎం) నాయకులు రఘోత్తమ్ రెడ్డి**




మల్హర్ రావు: సీపీఐ(ఎం) మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) నాయకులు,ప్రముఖ న్యాయవాది కేతిరెడ్డి రఘోత్తమ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మంథని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ(ఎం) 3వ జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఎన్టిపిసిలో ఈనెల 23 23 24 తేదీలలో సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు జరగనున్నాయన్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకత్వం హాజరకావడంతోపాటు,జిల్లా నలుమూలల నుండి ప్రతినిధులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. మొదటి రోజున సాయంత్రం నాలుగు గంటలకు వేలాది మందితో ప్రదర్శన భారీ బహిరంగసభ నిర్వహించబోతున్నామన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువజనులు ,మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి తీర్మానాలు రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలు జయప్రదానికై మంథని నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ప్రజానికం హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గోరెంకల సురేష్ బావు రవి, కృష్ణ, మల్లేష్, కుమార్ పాల్గొన్నారు.

# ఫోటో షూట్లు..కొత్త బెడ్లు, కొత్త బెడ్‌షీట్లు..కాళ్లకు సాక్స్

హైదరాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఆ పార్టీకి చెందిన నేతలు మూసీ నిద్ర పేరిట పెద్ద డ్రామా చేశారని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మూసీ నిద్ర అంటే ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వాటికి పరిష్కారం చూపించడం, ప్రభుత్వాల దృష్టికి తేవడం అని అన్నారు. కానీ బీజేపీ నేతలు మాత్రం ఫోటో షూట్లు కొత్త బెడ్లు కొత్త బెడ్‌షీట్లు దోమలు కుట్టకుండా కాళ్లకు సాక్స్ వేసుకుని నిద్ర చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మూసీ పక్కనగానీ, బఫర్ జోన్లో కూడా నిద్ర చేయలేదన్నారు. మూసీకి ఎక్కడో దూరంగా నిద్ర చేస్తే కాలుష్యం, దుర్గంధం, దోమలు, ఈగలతో ప్రజలు పడుతున్న కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఇంతకు కిషన్‌రెడ్డికి మురుగు వాసన వచ్చిందో, లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ సీఎంగా ఉన్న సమయంలో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రారంభించి 20 ఏండ్లు అవుతున్నా పూర్తి కాలేదన్నారు. అక్కడి 13వేల మంది నిర్వాసితులకు పరిహారం కూడా ఇవ్వలేదని విమర్శించారు. సబర్మతికి లేని అభ్యంతరం మూసీకి ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ బలరాం నాయక్, పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు ఎప్పుడు కష్టమొచ్చినా బీజేపీ రక్షణ కవచంలా నిలబడుతుందని అన్నారు. అనేక విషయాల్లో ఆ రెండు పార్టీలు పరస్పరం సహకరించుకుంటున్నాయని విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు డీపీఆర్ వచ్చేంతవరకు కూడా ఓపిక పట్టరా? అని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రశ్నించారు. మూసీ నిద్ర పేరిట చిలిపి చేష్టలు చేస్తున్నారని అన్నారు. 'చారుపే చర్చ' కాదు%ౌ%'మూసీ పే చర్చ' చేయాలని కోరారు. మూడు నెలలపాటు నిద్ర చేస్తే అర్థమవుతుందంటూ సీఎం సూచించారనీ, 12 గంటలు నిద్ర చేస్తే ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. అక్కడికెళ్లి కేంద్ర మంత్రి ఏం సాధించారని అన్నారు. నిరాశ్రయులకు డబుల్‌బెడ్ రూమ్‌లు ఇస్తామన్నారు. గుజరాత్‌కు గులాములుగా మారి, రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని విమర్శించారు. దక్షిణ భారతదేశం అభివృద్ధి కాకూడదా? అని ఆయన ప్రశ్నించారు. మూసీ రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల గుండా 150 కి.మీ దూరం ప్రవహిస్తున్నదని చెప్పారు. ఆ రైతులకు పంట పొలాలకు నీరు అందుతుందన్నారు. రానున్న కాలంలో ప్రళయాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారని చెప్పారు. దీంతో ప్రజలకు సురక్షితమైన హైదరాబాద్‌ను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ముందుకు పోతున్నారని అన్నారు. మూసీ ప్రక్షాళనపై కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ అవగాహన ఉందనీ, కాబట్టి తాము నిద్ర చేయాల్సిన అవసరం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే మూసీ నిద్ర చేసిన కిషన్‌రెడ్డి ప్రభుత్వానికి మంచి ప్లాన్ ఇవ్వాలని కోరారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లాగా కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ పంపించబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతుందంటూ ప్రశ్నించగా.. అది బీఆర్‌ఎస్, బీజేపీ సృష్టిస్తున్న ప్రచారమేనని చెప్పారు. కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి కోరామనీ, ఆయన ఎందుకు అనుమతి ఇవ్వడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. లగచర్ల నిర్వాసితులకు భూమికి భూమి, భూమి అందుబాటులోని సమయంలో పైసలు ఇస్తామన్నారు. ఫార్మా కంపెనీకి భూసేకరణ కోసం ప్రయత్నిస్తున్న క్రమంలోనే బీఆర్‌ఎస్ రైతులను రెచ్చగొట్టిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మకూడదని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీ సీఎం అల్లుడు కోసమేనా? అన్న ప్రశ్నకు అది బీఆర్‌ఎస్ చేస్తున్న పుకార్లు అని ఎంపీ కొట్టిపారేశారు.

# మంచిర్యాల యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ లో ఏం జరుగుతోంది

అదిలాబాద్: మంచిర్యాలలోని ప్రభుత్వ పశు సంరక్షణ కేంద్రంలో శునకాలు తిండి లేక ఆకలితో మరణించాయని ఈ మధ్య పత్రికల్లో వార్తలు వచ్చాయి. సమయానికి ఆహారం అందకే వాటి ప్రాణాలు పోయాయని అక్కడ పనిచేసిన కొందరు మాజీ ఉద్యోగులు ఆరోపించారు. 'అధికారుల అలసత్వంతో మంచిర్యాల పశుసంరక్షణ కేంద్రంలో పది రోజులుగా ఆకలితో అలమటించి 8 శునకాల ప్రాణాలు పోయాయి. మరో 12 శునకాలు కొన ఊపిరితో కొట్టుమిటాడుతున్నాయి. ఈ ఘటనకు కారణమైన వారి పట్ల చర్యలు తీసుకోవాలి' అని ఆయన డిమాండ్ చేశారు. అయితే, ఆ శునకాలు ఆకలితో చనిపోయాయనే వార్తలు అవాస్తవం అని అధికారులు, ఈ కేంద్ర నిర్వాహకులు అంటున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలో మున్సిపాలిటీ నిధులతో నిర్మించిన పశు సంరక్షణ కేంద్రం 2024 ఏప్రిల్‌లో ప్రారంభమైంది. వీధి కుక్కల సంఖ్య నియంత్రణకు ఇక్కడ యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణ బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన 'యానిమల్ వెల్ఫేర్ సొసైటీ' సంస్థకు అప్పగించారు. ఈ కేంద్రంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిని వివిధ కారణాలతో ఈ సంస్థ ఇటీవల పని నుంచి తొలగించింది. ఆ తర్వాత ఇక్కడ తిండి లేక శునకాలు చనిపోయాయన్న వార్తలు వచ్చాయి. జనసంచారం అంతగా ఉండని ఒక గుట్ట ప్రాంతంలో ఈ కేంద్రం ఉంది. ఆ సమయంలో అక్కడ ఇద్దరు సిబ్బంది ఉన్నారు. కాసేపటికి నిర్వహణ సంస్థకు చెందిన వెటర్నరీ డాక్టర్‌తో పాటు సూపర్ వైజర్ అక్కడికి వచ్చారు. ఈ సెంటర్లో గతంలో పనిచేసిన మాజీ ఉద్యోగులు కొందరు కూడా అక్కడికి వచ్చారు. అక్కడి కెన్నెల్స్‌లో (శునకాలను ఉంచే ప్రదేశం) దాదాపు 20 వరకు శునకాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటి ముందు ఆహారం, నీరు ఉంది. సెంటర్ లోపల ఆ రోజు లేదా అంతకుముందు రోజో అంతా శుభ్రం చేసినట్టుగా అనిపించింది. శునకాలను ఉంచిన కొన్నికెన్నెల్స్‌లో మలమూత్రాలు, ఆహారం, నీరు అంతా ఒకే దగ్గర కలిసి అపరిశుభ్ర వాతావరణం ఉంది. జీతాలివ్వకుండా వాచ్ మెన్, వంట మనిషి, ఇద్దరు వెటర్నరీ సహాయకులు, హెల్పర్ ఇలా మొత్తం ఐదుగురిని ఇటీవల తొలగించారని వారు చెప్పారు. పది రోజుల కిందట మమ్మల్ని ఉద్యోగం నుంచి తీసేశారు. అప్పటి నుంచి శునకాలకు అన్నపానీయాలు లేవు. సెంటర్‌ను క్లీన్ చేయడం లేదు. ఈ మధ్య కాలంలో 15 శునకాలు చనిపోయాయి'' అని మాడెం మధుకర్ అన్నారు. ''బియ్యం అయిపోయాయని ఫోన్ చేస్తే ఐదు రోజులకు గానీ డబ్బులు పంపలేదు. అప్పుడు సెంటర్లో సుమారు 70 శునకాలున్నాయి. వాటిని బంధించే వ్యక్తులే వాటికి వండి పెడతారని, వారే వాటికి మత్తు మందు ఇస్తూ, క్లీనింగ్ పనులు చేస్తారని నన్ను పని నుంచి తీసేశారు" అని వాచ్‌మెన్‌గా పనిచేసిన కొమురయ్య చెప్పారు.'ఈ రెండు మూడు రోజుల్లో ఏడు శునకాలు చనిపోయాయి. అంతకు ముందు 15 వరకు చనిపోయాయి. వాటిని మేమే తీసుకువెళ్లి పారేశాం' అని ఆయన అన్నారు తిండి లేక శునకాలు చనిపోయాయనే వార్తలను మంచిర్యాల ఏబీసీ కేంద్రం నిర్వహణ బాధ్యతలను చూస్తున్న 'యానిమల్ వెల్ఫేర్ సొసైటీ' కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ ఖండించారు. నాలుగు శునకాలే చనిపోయాయని ఆయన అన్నారు. 'అన్నం పెట్టక శునకాలు చనిపోయాయన్నది అవాస్తవం. చనిపోయిన నాలుగు శునకాలవి సహజ మరణం. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన, అవసరానికి మించి ఉన్న సిబ్బందిని తొలగించాం. సెంటర్లో సిబ్బంది లేరన్నది అవాస్తవం" అని శ్రీనివాస్ అన్నారు. "గత మూడు నెలలుగా మున్సిపాలిటీ నుంచి రావాల్సిన సుమారు రూ. 8 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులను అడిగితే సమగ్ర సర్వేలో ఉన్నాం, బడ్జెట్ లేదు వంటి కారణాలు చెబుతున్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్స్ క్లియర్ కావాలి. అలా జరగడం లేదు. బిల్లులు వస్తేనే సప్లయర్స్, వర్కర్స్‌కు చెల్లింపులు సక్రమంగా జరుగుతాయి. ప్రస్తుతానికి కార్యకలాపాలు నిలిపివేశాం. ఇక్కడి శునకాలను మంచిర్యాల మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించాం. బిల్లులు వచ్చాక యథావిధిగా కేంద్రాన్ని కొనసాగిస్తాం" అని అన్నారు డాక్టర్ శ్రీనివాస్. జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల నుంచి వచ్చే శునకాలకు ఈ కేంద్రంలో సర్జరీలు నిర్వహిస్తున్నాం. కేంద్రంలో ఆహారం అందుబాటులో ఉందని మా విచారణలో తేలింది" అని ఆయన చెప్పారు. నిజానికి జంతు సంరక్షణ బాధ్యత ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో లేదు. పశుసంవర్ధక శాఖలో సిబ్బంది కొరత ఉంది. జిల్లా స్థాయి బోర్డులు పనిచేయడం లేదు. తెలంగాణలో నిబద్ధత కలిగిన జంతు సంరక్షణ సంస్థల కొరత ఉంది. రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో (కార్పొరేషన్లను కలుపుకుని) కేవలం మూడు సంస్థలే పనిచేస్తున్నాయి. వాటిపై పర్యవేక్షణ కరువైంది" అని మేడ్చల్ జిల్లా జంతు సంరక్షణ బోర్డ్ సభ్యులు, హైకోర్ట్ న్యాయవాది ఎన్. ప్రవళిక అన్నారు. ఏబీసీ సెంటర్‌లో కెన్నెల్, శిక్షణ పొందిన పశువైద్యులు, ఆపరేషన్ థియేటర్, ఎలాంటి హానీ కలగకుండా శునకాలను బంధించి, తరలించేందుకు ప్రత్యేక వాహనం, శిక్షణ పొందిన సిబ్బంది, ఇతర సౌకర్యాలు ఉండాలి. కెన్నెల్‌లో గాలి, వెలుతురు ప్రసరణ ఉండాలి. వాటిని శుభ్రపరిచేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ ఉండాలి. ఒంటరిగా లేదా 3 నుంచి 5 శునకాలను కలిపి ఉంచొచ్చు. అయితే ప్రతి శునకానికి 3×4×6 పొడవు, వెడల్పు, ఎత్తు కొలతలో స్థలం ఉండాలి. జంతువులను ఈ సెంటర్లకు తెచ్చే ముందు, తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్-2023 వివరిస్తున్నాయి. కేంద్రానికి తెచ్చిన శునకాల మధ్య ఘర్షణ లేకుండా ఒక దఫాలో ఒకే ప్రాంతానికి సంబంధించిన శునకాలనే తేవాలి. ఆడ, మగలను వేర్వేరుగా ఉంచాలి. ఆరోగ్యంగా ఉన్న వాటికే ఆపరేషన్లు నిర్వహించాలి.

# పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు గల చిన్నారులకు వైద్య చికిత్స

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి: జిల్లాలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు గల చిన్నారులకు వైద్య చికిత్స అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఆర్.బి.ఎస్.కే ద్వారా జూలై నెల నుంచి జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహించిన మెడికల్ క్యాంపు ల ద్వారా 36 మంది గుండె జబ్బులు గల చిన్నారులను గుర్తించామని కలెక్టర్ తెలిపారు. హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రి ద్వారా ఇప్పటి వరకు 19 మంది చిన్నారులకు హార్ట్ సర్జరీ, 3 చిన్నారులకు మెడికల్ మేనేజ్మెంట్, 4 చిన్నారులకు రివ్యూ ద్వారా మొత్తం 26 మంది చిన్నారులకు వైద్య చికిత్స పూర్తి చేశారని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అపోలో ఆసుపత్రిలో మరో 4 చిన్నారులకు చికిత్స జరుగుతుందని, వారం రోజులలో 2 చిన్నారులకు అడ్మిట్ చేస్తామని, కార్డియాక్ క్యాంపు కోసం 1 చిన్నారి ని కూడా త్వరలోనే అడ్మిట్ చేస్తారని, మిగతా 3 రినీ ఆపరేషన్ కోరకు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గుండె జబ్బు గల చిన్నారులందరికీ మెరుగైన వైద్య చికిత్స అందిస్తూ వారి ప్రాణాల సంరక్షణకు జిల్లా తరఫున సంపూర్ణంగా కృషి చేస్తున్నామని వీటికి కృషి చేసినా జిల్లా వైద్య అధికారి డా. అన్న ప్రసన్న కుమారి, ఆర్.బి.ఎస్. కె. ప్రోగ్రాం అధికారి డా. కిరణ్ కుమార్ నీ, ఆర్బి.ఎస్.కే. మొబైల్ హెల్త్ టీమ్స్ నీ అభినందిస్తున్నామనీ జిల్లా కలెక్టర్ తెలిపారు.

# కులగణనలో గోప్యమెంత

కరీంనగర్: తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు సమగ్ర కులగణనను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 1.17 కోట్లకు పైగా ఇళ్లను గుర్తించి మొదటి దశలో వాటికి స్టిక్కర్లు అంటించారు. రెండో దశలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. మొత్తం 8 పేజీల్లో 56 అంశాలకు సంబంధించి 75 ప్రశ్నల ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. అయితే ఇందులో ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య ఇలా అన్ని అంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ఆస్తి వివరాలు అందులో స్థిరాస్తులు, చరాస్తులు, అప్పులు, ఒకవేళ రాజకీయ నేపథ్యం ఉంటే ఎటువంటి నేపథ్యం, విద్యార్హతలు ,కులం ,మతం ,మాతృభష ఇలా మొత్తం సమాచారం సేకరిస్తున్నారు. ఓ రకంగా చెప్పాలంటే మీకు సంబంధించిన ప్రతి సమాచారం ప్రభుత్వం సేకరిస్తుంది. బ్యాంక్ అకౌంట్, పాస్బుక్ ఉందా లేదా ఇలాంటి సమాచారం కూడా ప్రభుత్వం సేకరిస్తుంది. అందుకే ప్రజలకు తామిచ్చే సమాచారంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమాచారం సేకరించిన తర్వాత ప్రభుత్వం నుంచి తమకు వచ్చే పథకాలు కొన్నింటిని తీసేస్తారనే అపోహలు ఉన్నాయి. అంతేకాకుండా సమాచారం వివిధ దశల్లో ప్రభుత్వానికి చేరుతుంది కాబట్టి గ్రౌండ్ లెవెల్ లో పనిచేసే ఎన్యుమరేటర్లు గా ప్రభుత్వ సిబ్బంది సమాచారం సేకరిస్తున్నారు. ఈ సమాచారం అంత ప్రభుత్వం వద్దకు చేరిన తర్వాత దీన్ని కంప్యూటర్లో భద్రపరుస్తారు. 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం అంతా కూడా కేవలం కోడ్ రూపంలో మాత్రమే నమోదు చేస్తున్నామని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ఉదాహరణకు మీకు స్థిర చరాస్తులు ఉన్నాయా అనే కాలంలో ఉన్నాయి అంటే ఒక కోడ్ లేవు అంటే ఇంకో కోడ్ తో నమోదు చేస్తున్నారు. అంతే తప్పితే స్థిరాస్తులు చరాస్తులు పూర్తి వివరాలు సేకరించట్లేదు. బ్యాంక్ ఎకౌంట్ కు సంబంధించిన వివరాల కాలంలో బ్యాంక్ అకౌంట్ ఉందా లేదా అని మాత్రమే కోడ్ రూపంలో నమోదు చేస్తున్నారు తప్పితే బ్యాంక్ అకౌంట్ వివరాలు అడగటం లేదు. చాలామందికి తాను ఇచ్చే ఆధార్ నెంబర్ భద్రతపై అనేక అనుమానాలు ఉన్నాయి. దానికి కూడా ప్రభుత్వం సమాధానం చెప్పింది. ఆధార్ అనేది కేవలం ఆప్షనల్ మాత్రమే. ఆధార్ నెంబర్ కచ్చితంగా ఇవ్వాల్సిన అవసరం లేదు కానీ ఆధార్ నెంబర్ ఉంటే ప్రభుత్వ పథకాలు అందించేందుకు సులువుగా ఉంటుంది. ఒకవేళ ఎవరికైనా ఆధార్ నెంబర్ ఇవ్వటం ఇష్టం లేకపోతే ఏన్యుమరేటర్లు తీసుకోరు. సమాచార సేకరణలో ప్రజలు ఏ సమాచారాన్ని చెబితే ఆ సమాచారం మాత్రమే నమోదు చేస్తున్నామని మంత్రులు పదేపదే చెబుతున్నారు. సమాచారం సేకరించేటప్పుడు ఎన్యుమేటర్లు ఎవరూ కూడా పౌరులను సమాచారం కోసం బలవంత పెట్టరని ప్రభుత్వం స్పష్టం చేసింది. సమాచారం సేకరించే ప్రతి దశలో గోప్యత తో పాటు సమాచార భద్రత ఉండేలా సమాచారం సేకరించేటప్పుడు కేవలం ఉంది లేదు అనే సమాచారాన్ని కోడ్ రూపంలో మాత్రమే సేకరిస్తున్నామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నారు. ఈ డేటా ప్రభుత్వానికి చేరిన తర్వాత దాన్ని డిజిటలైజ్ చేసి కంప్యూటర్లో భద్రపరుస్తామని ఆ సమాచారాన్ని యాక్సిస్ చేసే అవకాశం ప్రభుత్వంలో కేవలం ఒకరు లేదా ఇద్దరికీ మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.. కాబట్టి పౌరులకు ఎటువంటి సందేహాలు లేకుండా తమ సమాచారాన్ని ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం వద్ద పూర్తి సమాచారం ఉంటే భవిష్యత్తులో నూతన పథకాలను రూపకల్పన చేసేందుకు, సరైన అర్హులను గుర్తించేందుకు, అమలు చేసేందుకు, పారదర్శకత పాటించేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అయితే అధికారుల వద్ద ఉండాల్సిన సమగ్ర సర్వే దరఖాస్తు ఫారాలు రహదారి పక్కన దర్శనమిచ్చాయి. అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు తాము చేపట్టామని చెప్పిన సర్వేకు సంబంధించిన ఫారాలు రోడ్డు పక్కన కుప్పలుగా కనిపించడంతో వాటి ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దరఖాస్తు ఫారాలు మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కనిపించాయి. పేదలకు, అన్ని వర్గాలకు మేలు చేయడం కోసమే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే మొదలుపెట్టింది. కానీ సమగ్ర సర్వే ఫారాలు రోడ్డు పక్కన కుప్పలుగా కనిపించడంతో అంతా షాకయ్యారు. సమాచారం అందుకున్న మేడ్చల్ మునిసిపాలిటీ కమిషనర్ నాగిరెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని దరఖాస్తులు పరిశీలించారు. తమ సిబ్బందితో కలిసి సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తులను కారులో అక్కడి నుంచి ఆఫీసుకు తరలించినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో రాష్ట్రంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించింది ప్రభుత్వం. ప్రజలకు ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్ల పక్కన దర్శనమివ్వడం తెలిసిందే. ప్రజల సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని చెప్పిన నేతలు. ఇలా రోడ్లపై ఎలా పడేస్తారని అప్పట్లోనే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తులు ఫారాలను అన్ లైన్ లో అప్‌లోడ్ చేసేందుకు తీసుకెళ్తుండగా పొరపాటుగా రోడ్డుపై పడిపోయి ఉంటాయని అధికారులు వివరణ ఇచ్చుకున్నారు. తాజాగా సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు మేడ్చల్ జిల్లాలో రహదారి పక్కన పడేసినట్లు స్థానికులు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమాచారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడుతున్నారు. తెలంగాణలో తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తే కచ్చితంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. నిజామాబాద్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ సైతం ఇదే విషయాన్ని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం తాము సమగ్ర కుటుంబ సర్వే చేపట్టి, అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. అందులో భాగంగా తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు పలుమార్లు వెల్లడించారు. సమగ్ర సర్వే కాదని, అది బోగస్ సర్వే అని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. ఆరు గ్యారంటీలు, రైతులకు రైతు బంధు, రైతు భరోసా నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ సర్కార్ కాలయాపన చేస్తుందని ఆరోపిస్తున్నారు.

# మతోన్మాద వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి.

రామగుండం: గోదావరిఖని ఐ ఎఫ్ టీ యు కార్యాలయంలో వామ పక్ష పార్టీల సమావేశం జరిగింది. రామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో 2024 నవంబర్ 21న. గోదావరిఖని లో జరిగే మతోన్మాద వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా సిపిఐ.జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,సీపీఎం. జిల్లా కార్యదర్శి వై యాకయ్య, సీపీఐ(ఎం ఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న,సీపీఐ (ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సీపీఐ (ఎం ఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గుండేటి మల్లేశం.లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తుందని, భారత రాజ్యాంగాన్ని ఖూనిచేస్తూ, ప్రజల మధ్య భావోద్వేగాలనీ రెచ్చగొడుతుందని వారు అన్నారు. మతం వ్యక్తిగతమని, కానీ మతం పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని వారు అన్నారు. కులం ,మతం, ప్రాంతం పేరుతో పాలక వర్గ పార్టీలు ప్రజల ఆలోచనలు వక్రమార్గం పట్టిస్తున్నాయని అన్నారు. తెలంగాణ లోని మానస పార్టీలు కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలను చైతన్యం చేయడానికి మతసామరాస్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రజా సమస్యలు, పౌర హక్కులు, లౌకిక ప్రజాస్వామ్యం, సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం, నిరంకుశ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా మతోన్మాదం,కులో న్మాదం, రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదని చాటి చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల పార్టీల పిలుపులో భాగంగా గోదావరిఖనిలో జిల్లా వానపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే మతోన్మాద వ్యతిరేక ప్రదర్శన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు గౌతం గోవర్ధన్, చంద్రశేఖర్, వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, ఐ కృష్ణ,ఈ నరేష్, తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, ఎం దుర్గయ్య,ఎడ్ల రవికుమార్, వైకుంఠం దితరులు పాల్గొన్నారు.

# జైలు, పాదయాత్రలపైనే తెలుగు నేతల ఆశలు

హైదరాబాద్: జైలుకు వెళ్లడం, పాదయాత్రలు చేయడం.. రాజకీయ నాయకులకు ఫ్యాషన్‌గా మారింది. జైలుకు వెళ్లినా.. పాద యాత్ర చేసిన గెలిచి సీఎం అవుతామని భావిస్తున్నారు. గతంలో అయ్యారు కూడా. అందుకే ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు కీలక నేతలు జైలుకు వెళ్లడానికి తహతహలాడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. విభజిత తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి నేతలు మొన్నటి వరకు పాదయాత్రలు చేశారు. ప్రజల్లోకి వెళ్లడం నేతలకు కలిసి వస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలను గెలిపిస్తోంది. నేతలను సీఎంలను చేస్తోంది. 2003లో వైఎస్ఆర్ చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీలాపడిన కాంగ్రెస్‌కు కొత్త ఉత్సాహం తెచ్చింది. 2004లో అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ సీఎం అయ్యారు. ఇక 2013లో జగన్ కూడా ఏపీలో పాదయాత్ర చేశారు. అయితే 2014లో అధికారంలోకి రాలేదు. 2018 మళ్లీ యాత్ర చేశారు. ఈసారి అధికారం వరించింది. జగన్ సీఎం అయ్యారు. ఇక 2022లో తెలంగాణ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రం కాంగ్రెస్‌ను పదేళ్ల తర్వాత ఎలంగాణలో అధికారంలోకి తెచ్చింది. అయితే భట్టి సీఎ కాలేదు. డిప్యూటీ సీఎంతో సరిపెట్టుకున్నారు. ఇక 2024ఎన్నికల్లో ఏపీలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేశారు. దీంతో ఆశించిన ఫలితాలు వచ్చాయి. టీడీపీ మళ్లీ పుంజుకుంది. అధికారం చేపట్టింది. చంద్రబాబు సీఎం అయ్యారు. లోకేశ్ ముఖ్యమై మంత్రి అయ్యారు. ఇక జైలుకు వెళ్లినా సీఎం అవుతామనే అభిప్రాయం ఉంది. జైలుకు వెళితే పవర్ ఫుల్ అని నేతలు భావిస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయకుడు, వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లొచ్చాక సీఎం అయ్యారు. పాదయాత్ర చేయడం కష్టమైన పని, జైలుకు వెళ్లడం ఈజీ బాగా విశ్రాంతి దొరకడంతోపాటు మైలేజీ వస్తుంది. ఇది కేసీఆర్, జగన్‌కు బాగా అర్థమైంది. రేవంత్‌ను అరెస్టు చేయించిన కేసీఆర్ పార్టీని గెలిపించలేదు. చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ కూడా పార్టీని గెలిపించలేకపోయారు. దీంత ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు కీలక నేతుల జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారు.

**కేటీఆర్, జగన్ ఉత్సాహం..**

రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలకంగా ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వైసీపీ అధినేత జగన్ తాము మళ్లీ అధికారంలోకి రావాలంటే పాదయాత్ర చేయాలి లేదా జైలుకు వెళ్లాలని భావిస్తున్నారు. పాదయాత్ర ఇప్పుడు కష్టంగా ఉంది. దీంతో జైలుకు వెళ్లడమే మేలని భావిస్తున్నారు. ఇందుకు తహతహలాడుతున్నారు. ఉత్సాహం చూపుతున్నారు. ఫార్ములా?1 ఈ రేసింగ్ వ్యవహారంలో తాను జైలుకు వెళ్లడానికి రెడీ అని కేటీఆర్ అంటున్నారు. జైల్లో యోగా చేసి ఫిట్‌గా మారి రెండు నెలల్లో బయటకు వస్తానని చెప్పుకుంటున్నారు. తర్వాత పాదయాత్ర చేస్తానని అంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఫార్ములా రేసు కేసుతోపాటు తాజాగా వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్‌పై దాడి కేసులో కేటీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈమరకు బీఆర్ఎస్ న నేతలు కూడా మానసికంగా సిద్ధమవుతున్నారు. ఏరోజైనా కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉంది. ఇక ఏపీలో కూటమి ప్రభుత్వం ?గ్పి సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేస్తోంది. దీంతో వైసీపీ అధినేత జగన్.. తాడేపల్లి ప్యాలెస్‌లో మీడియా సమావేశం నిర్వహించి సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. ఎంత మందిని అరెస్టు చేసినా ప్రశ్నించడం ఆగదని హెచ్చరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే పోస్టులు పెట్టాలి అని సూచించారు. అరెస్ట్ అయితే పార్టీ అండగా ఉంటుందని వెల్లడించారు. అరెస్టు చేయదలిస్తే.. ముందుగా తనతోనే మొదలు పెట్టాలని జగన్ సీఎం చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఇక అసెంబ్లీలో అడుగు పెడితే అనర్హత వేటు వేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. దమ్ముంటే అనర్హత వేటు వేయాలని సవాల్ చేశారు.

**కేడర్‌లో ఊపు తెచ్చేందుకే..**

ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్, వైసీపీలు రెండు రాష్ట్రాల్లో డీలా పడ్డాయి. వాటిని జాకీలు పెట్టి లేపేందుకు నేతలు యత్నిస్తున్నారు. క్యాడర్‌లో ధైర్యం నింపేందకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో చిన్న నేతల అరెస్టుతో లాభం ఉండదని, తాము జైలుకు వెళితే పార్టీల్లో భావోద్వేగాలు రగిలి మళ్లీ ఉత్సాహం వస్తుందని కేటీఆర్, జగన్ భావిస్తున్నారు.

# ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

- ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలి
- బూర్జువా పార్టీల విధానాలు ప్రతిఘటించాలి
- ప్రజా ఉద్యమాలకు ఎర్రజెండా నాయకత్వం : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య
- మహబూబాబాద్ జిల్లా సీపీఐ(ఎం) మహాసభలు ముగింపు
- జిల్లా కార్యదర్శిగా సాదుల శ్రీనివాస్ తిరిగి ఎన్నిక



మహబూబాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతున్నదని, ప్రజలు స్వచ్ఛందంగా ప్రజా పోరాటాలకు వచ్చే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో సీపీఐ(ఎం) ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య అన్నారు.

బూర్జువా పార్టీలను నిలదీసేలా రోడ్లమీదకొచ్చే ప్రజలకు ఎర్రజెండా నాయకత్వం వహించాలని తెలిపారు. సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభ రెండవ రోజు ఆదివారం మహబూబాబాద్‌లోని బిషప్ హజరయ్య ఫంక్షన్ హాల్‌లోని వై వెంకటయ్య ప్రాంగణంలో నిర్వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్. వీరయ్యతో కలిసి నాగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్.. ఎన్నికల్లో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు దేశం అప్పు రూ.55వేల కోట్లు ఉండగా 11 ఏండ్ల నరేంద్ర మోడీ పాలనలో రూ.1,10,000 కోట్ల అప్పు చేశారని విమర్శించారు. అలాగే ఆకలి, దారిద్ర్యం, పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. ప్రజల ఆగ్రహం నిరసన బయటికి రావడానికి ఇంకా ఎంతో సమయం పట్టదని అన్నారు. శ్రీలంకలో గత పాలకుల విధానాల వల్ల ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తి.. రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారని తెలిపారు. వారికి ఎర్రజెండా అండగా నిలిచి ముందుండి పోరాడిందని తెలిపారు. దాంతో ప్రత్యామ్నాయంగా ఎర్రజెండాకు అధికారం కట్టబెట్టారని అన్నారు. ఆ స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో 67000 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, అవన్నీ అన్యాక్రాంతం అయ్యాయని చెప్పారు. భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచాలని పిలుపునిచ్చారు.

# టీమిండియా నిర్ణయాన్ని మరోసారి తప్పుబట్టిన మైకెల్ వాన్



భారత జట్టు ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌కు ముందు వార్మప్ మ్యాచ్‌లను రద్దు చేసి, నెట్ సెషన్లు, ఇంట్రా-స్క్వాడ్ గేమ్‌లను ప్రాధాన్యత ఇవ్వడంపై ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ స్పందించారు. ప్రాక్టీస్ మ్యాచ్ రద్దు చేసిన టీమ్ ఇండియా సహసమమే చేస్తుందన్నారు. అస్ట్రేలియా లాంటి కఠిన పరిస్థితుల్లో సరైన ప్రాక్టీస్ మ్యాచ్ లేకుండా బరిలోకి దిగడం నిజంగా సవాలే అని అన్నారు.

వార్మప్ మ్యాచ్‌లు రద్దుపై అసంతృప్తి:

ప్రత్యర్థిగా ఓ జట్టుతో ఆడకుండా ఇంట్రా-స్క్వాడ్ గేమ్‌లు మాత్రమే ఆడటం వల్ల మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పోటీ మనస్తత్వాన్ని తగ్గిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రత్యక్షంగా తటస్థ వాతావరణంలో ప్రాక్టీస్ మ్యాచ్‌లు అవసరమని వాన్ పేర్కొన్నారు. వాన్ సూచించినట్లుగా, WACA గ్రౌండ్ వంటి బౌన్సీ పిచ్‌ల పై ప్రాక్టీస్ మ్యాచ్ ఆడితే అదే భారత జట్టుకు సిద్ధమవ్వడానికి అద్భుతంగా ఉంటుందన్నారు. అయితే, భారత టీమ్ పిచ్ పై ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతూ అర్థం చేసుకుంటేనే ఆస్ట్రేలియాలోని బౌన్సీ పిచ్ లపై అసలైన మ్యాచ్ లో రాణించే అవకాశముందన్నారు. ఆస్ట్రేలియా పర్యటన లాంటి సుదీర్ఘ ప్రయాణంలో వారు ఎదుర్కునే ప్రతి బంతి బౌన్స్, పేస్ ను ప్రత్యక్షంగా అనుభవిస్తేనే గెలుపుకు కీలకమవుతుందన్నారు వాన్.

గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని ప్రణాళిక:

భారత జట్టు ఆస్ట్రేలియాలో ప్రత్యక్ష గేమ్‌లు కాకుండాసెంటర్-వికెట్ సెషన్లు, నెట్ ప్రాక్టీస్‌ను ఎంచుకుంది. ఆస్ట్రేలియాలో మ్యాచ్ ముందు తరచుగా చూసే ఇంట్రా-స్క్వాడ్ గేమ్‌ల ద్వారా ఆటగాళ్లకు ఆట పరిస్థితులకు అనుగుణంగా ప్రాక్టీస్ చేయించడం లక్ష్యంగా ఉంది.

WACA గ్రౌండ్ సమీపంలో ప్రాక్టీస్ సెషన్ల ద్వారా బౌన్సింగ్ పిచ్‌లకు అనువుగా ప్రిపేర్ అవ్వాలని భావించారు. ఇది ఆటగాళ్లకు బౌన్స్‌ను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. ఇంట్రా-స్క్వాడ్ గేమ్‌లు జట్టు సభ్యుల బలహీనతలు, బలాలను తెలుసుకోవడంలో సహాయపడతాయి. ఆటగాళ్లను ప్రత్యేకంగా పునరావృతంగా ప్రాక్టీస్ చేయించవచ్చు. ప్రత్యర్థి జట్టు షరతులకు అనుగుణంగా ఆటగాళ్లు అనుకూలంగా మారడానికి ప్రత్యక్ష మ్యాచ్‌లు లేకపోవడం ప్రతికూలతగా మారవచ్చు. వాన్ సూచించినట్లుగా, నేరుగా సిరీస్‌లోకి ప్రవేశించడం మొదటి మ్యాచ్‌లో ప్రభావం చూపవచ్చు. అయితే వాన్ ఎప్పుడు మన జట్టు గురించి ప్రస్తావించిన టీమిండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ ఖచ్చితంగా స్పందిస్తారు. దీంతో ఈ సారి వాన్ కామెంట్స్ పై జాఫర్ ఏమంటాడోనని క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# విజయంతో ముగిస్తారా?

- మలేషియాతో భారత్ ఢీ నేడు
- గచ్చిబౌలిలో ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్
- రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్18లో..




హైదరాబాద్: భారత ఫుట్‌బాల్‌కు ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు ఇచ్చింది. జనవరిలో వరుసగా రెండోసారి ఆసియా కప్‌లో పోటీపడిన భారత్.. జూన్‌లో ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్ నుంచి నిష్క్రమించింది. ఫిఫా ర్యాంకింగ్స్‌లోనూ దిగజారిన 'బ్లూ టైగర్స్'.. సొంతగడ్డపై ఇంటర్‌కాంటినెంటల్ కప్‌ను సైతం చేజార్చుకుంది. కొత్త కోచ్ మనాలో మార్కెజ్‌పై అంచనాలు భారీగా ఉన్నప్పటికీ.. జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆఖరిసారి భారత ఫుట్‌బాల్ జట్టు మైదానంలోకి రానుంది. హైదరాబాద్‌లోని జిఎంసి బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో నేడు మలేషియాతో ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌లో తలపడనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో మలేషియా, భారత్‌లు ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో బరిలోకి దిగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు జట్ల మధ్య ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ ఆసక్తిగా మారింది.

కోచ్ మనాలో మార్కెజ్ గత నాలుగేండ్లుగా హైదరాబాద్‌తో అనుబంధం కలిగి ఉన్నాడు. హైదరాబాద్ ఎఫ్‌సీ కోచ్‌గా మనాలో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టైటిల్ సాధించాడు. కుర్రాళ్లకు ఎక్కువ అవకాశాలు కల్పించి, ఫలితాలు రాబట్టడం మనాలో శైలి. కానీ ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలు అందించలేదు. అయినా, మనాలో మార్కెజ్ శైలిలో మార్పులేమీ రాలేదు.

గత మ్యాచుల్లో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని, కఠోర సాధన చేస్తున్న భారత జట్టు ఈ ఏడాదిని విజయంతో ముగించాలని ఎదురు చూస్తోంది. నేడు మలేషియాతో మ్యాచ్‌లో మైదానంలో ఆటగాళ్ల మార్పును మనాలో ఏ విధంగా చేస్తాడనే ఆసక్తి కనిపిస్తోంది. 'మలేషియా భిన్నమైన జట్టు. ఈ సవాల్‌కు భారత్ కొత్తగా సన్నద్ధమైంది. గతంలో చేసిన పొరపాట్ల నుంచి నేర్చుకున్నాం. ప్రత్యర్థిని దీటుగా ఎదుర్కొంటామనే దీమా ఉంది. చివరగా భారత్ ఇక్కడ మ్యాచ్‌కు అభిమానులతో స్టేడియం నిండిపోయింది. నేడు మలేషియాతో మ్యాచ్‌కు సైతం అభిమానుల నుంచి అదే స్థాయిలో మద్దతు ఉంటుందని ఆశిస్తున్నాను' అని మనాలో మార్కెజ్ అన్నారు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 125వ స్థానంలో, మలేషియా 133వ స్థానంలో కొనసాగుతున్నాయి. భారత కోచ్ మనాలో, మలేషియా కోచ్ మార్టిన్‌లు స్పెయిన్‌లోని బార్సిలోనా నగరానికి చెందిన వ్యక్తులు కావటం విశేషం.

# 'అబ్బే.. హెడ్‌కోచ్‌ను మార్చడం లేదు'.. పీసీబీ వివరణ



పాకిస్థాన్ బోర్డు త్వరలోనే కొత్త హెడ్‌కోచ్‌ను నిమిస్తుందనే వార్తలు మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ జట్టు ఆట మాదిరిగానే పీసీబీ తీరు కూడా అయోమయంగా ఉందంటూ పలువురు పాక్ బోర్డును విమర్శిస్తున్నారు.

ఈ నేపథ్యంలో కొత్త హెడ్‌కోచ్ నియామకంపై వస్తున్న వార్తలకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చెక్ పెట్టింది.

ప్రస్తుతం రెడ్ బాల్ కోచ్‌గా, వన్డే, టీ20లకు మధ్యంతర కోచ్‌గా సేవలందిస్తున్న జేసన్ గిలెస్పీ ని తప్పించడం లేదని పీసీబీ చెప్పింది. 'అబ్బే.. అదేం లేదు. ఇంతకుముందు ప్రకటన చేసినట్టే దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌కు జేసన్ గిలెస్పీనే పాకిస్థాన్ కోచ్‌గా వ్యవహరిస్తాడు' అని నవంబర్ 17వ తేదీన పీసీబీ తెలిపింది.

విదేశీ కోచ్‌లతో విసిగిపోయిన పీసీబీ స్వదేశీయులకే పట్టం కట్టాలని భావిస్తున్నట్టు పలు మీడియాల్లో కథనాలు వచ్చాయి. అందులో భాగంగానే జేసన్ గిలెస్పీ స్థానంలో తమ దేశానికే చెందిన మాజీ పేసర్ అకీబ్ జావెద్ (%ఖూఖనఅఎ జీఖజవఎ%)కు కోచ్‌గా బాధ్యతలు అప్పగించేందుకు పావులు కదుపుతోందనే సమాచారం వైరల్ అయింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత కొత్త కోచ్‌గా జావెద్ పేరును అధికారికంగా పీసీబీ ప్రకటించనుందని టాక్ వినిపించింది. కానీ, అదంతా తూచ్ అని నింపాదిగా పీసీబీ చెప్పడం కొసమెరుపు.

రెండేండ్లలో ఇద్దరు భారత గడ్డపై నిరుడు వన్డే వరల్డ్ కప్ అనంతరం మికీ ఆర్థర్‌ను వైట్‌బాల్ కోచ్‌గా తప్పించింది పాక్ బోర్డు. ఆపై టీ20 వరల్డ్ కప్‌లో ఘోర వైఫల్యం అనంతరం గ్యారీ కిర్‌స్టెన్ ను ఏరికోరి మరీ కోచ్‌గా తెచ్చుకుంది. కానీ, ఏ విషయమైనా సరే ముక్కుసూటిగా మాట్లాడే గిర్‌స్టెన్‌కు పాక్ బోర్డుతో పాటు ఆటగాళ్ల రాజకీయాలు నచ్చలేదు. దాంతో, ఇలాంటి జట్టుకు నేను కోచంగ్ ఇవ్వలేను అని ఈమధ్యే రాజీనామా చేశాడు. దాంతో పీసీబీ అంతర్మథనంలో పడింది. ఇంగ్లండ్ మాదిరిగా మూడు ఫార్మాట్లకు ఒకే కోచ్ సూత్రాన్ని పాటించాలని తొలుత అనుకుంది.

ప్రస్తుతం టెస్టు జట్టు కోచ్‌గా ఉన్న జేసన్ గిలెస్పీకే వన్డే, టీ20 కోచ్‌గా పగ్గాలు అప్పగించింది. అయితే.. అంతలోనే ఏమైందో తెలియదు గిలెస్పీని తొలగించి.. అతడి స్థానంలో మాజీ పేసర్ 1996 వరల్డ్ కప్ హీరో అయిన అకీబ్ జావెద్‌కు బాధ్యతలు అప్పగించాలని పీసీబీ భావిస్తోందని ఐసీసీ, ఈఎస్పీఎన్ క్రిక్ఇన్ఫో మీడియా ఎక్స్ ఖాతాలో పోస్టులు వెలిశాయి. దాంతో, పీసీబీ గిలెస్పీనే కొనసాగిస్తామని చెప్పి తప్పుడు కథనాలకు చెక్ పెట్టింది.

# రోహిత్ శర్మ దూరం

## - పెర్త్ టెస్టుకు హిట్‌మ్యాన్ గైర్హాజరు



పెర్త్ (ఆస్ట్రేలియా) : బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టుకు భారత కెప్టెన్ రోహిత్ శర్మ దూరం అయ్యాడు!. పితృత్వ సెలవులో ఉన్న రోహిత్ శర్మ నవంబర్ 22న ఆరంభం కానున్న పెర్త్ టెస్టుకు అందుబాటులో ఉంటాడనే అంచనాలు ఉన్నాయి. కానీ, రోహిత్ శర్మ కుటుంబంతో ఉండేందుకు మొగ్గుచూపటంతో హిట్‌మ్యాన్ లేకుండానే భారత్ పెర్త్ టెస్టుకు సిద్ధం కానుంది. రోహిత్ శర్మ, రితిక దంపతులు శుక్రవారం రెండో బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు డిసెంబర్ 6 నుంచి ఆడిలైడ్‌లో ఆరంభం కానుంది. కానీ, నవంబర్ 30 నుంచి భారత్ మూడు రోజుల డే నైట్ వార్మప్ మ్యాచ్ ఆడనుంది. పింక్‌బాల్ వార్మప్ మ్యాచ్ సమయానికి రోహిత్ శర్మ జట్టుతో చేరనున్నాడని సమాచారం.

పెర్త్ టెస్టుకు భారత్ టాప్ ఆర్డర్ సమస్యలు ఎదుర్కొంటుంది. రోహిత్ శర్మ పితృత్వ సెలవులో ఉండగా.. శుభ్‌మన్ గిల్ ఎడమ చేతి బొటనవేలి గాయానికి గురయ్యాడు. దీంతో గిల్ సైతం తొలి టెస్టుకు అందుబాటులో లేడు. రోహిత్ స్థానంలో గిల్ ఓపెనర్‌గా వస్తాడనే అంచనాలు కనిపించాయి. ఇప్పుడు రోహిత్, గిల్ దూరం కానుండటంతో.. ప్రత్యామ్నాయ ఆటగాళ్లు కెఎల్ రాహుల్, అభిమన్యు ఈశ్వరన్ ఇద్దరూ తుది జట్టులో నిలిచే అవకాశం లేకపోలేదు.

# కొకైన్ తీసుకుని మ్యాచ్ ఆడి.. అడ్డంగా బుక్కైన క్రికెటర్..



న్యూజిలాండ్ జట్టు ఫాస్ట్ బౌలర్ డగ్ బ్రేస్ వెల్ చిక్కుల్లో పడ్డాడు. కొకైన్ వినియోగం నిర్ధారణ కావడంతో అతడిని జట్టు నుంచి నెల రోజుల పాటు బ్యాన్ చేశారు.

ఈ ఏడాది జనవరిలో సెంట్రల్ స్టాగ్స్, వెల్లింగ్టన్ మధ్య జరిగిన మ్యాచ్ లో ఈ 34 ఏళ్ల క్రికెటర్ నిషేధిత మత్తు పదార్థం ప్రభావానికి గురైనట్టుగా గుర్తించారు. అయితే, ఈ మ్యాచ్లో బ్రేస్ వెల్ మెరుపు వేగంతో ప్రదర్శన చేశాడు. 21 పరుగులకు 2 వికెట్లు పడగొట్టాడు. 11 బంతులలో 30 పరుగుల ఇన్నింగ్స్ ఆడి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ టైటిల్ ను గెలుచుకున్నాడు.

మ్యాచ్ అనంతరం స్పోర్ట్స్ ఇంటిగ్రిటీ కమిషన్ పరీక్షలు నిర్వహించగా ఈ ఫాస్ట్ బౌలర్ కు పాజిటివ్ వచ్చింది. అయితే, బ్రేస్ వెల్ ఈ మ్యాచ్ కు ముందురోజున మత్తు పదార్థాలు సేవించాడని మ్యాచ్ రోజున కాదని కమిటీ విశ్వసించడంతో మూడు నెలల బ్యాన్ నెల రోజులకు కుదించారు. ఏప్రిల్ 2024 నాటి మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి బ్రేస్ వెల్ కు ఒక నెల శిక్ష విధించారు. అతను మార్చి లో తన చివరి హోమ్ మ్యాచ్ ఆడాడు. రెట్రోస్పెక్టివ్ ఎఫెక్ట్ తో శిక్ష విధించడంతో అతనిపై సస్పెన్షన్ పూర్తైంది. మరోసారి క్రికెట్ లో పాల్గొనవచ్చని కమిషన్ పేర్కొంది.

# ఆస్ట్రేలియాతో సిరీస్‌కు పుజారా..




ఆస్ట్రేలియాతో త్వరలో జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి భారత జట్టు సన్నద్ధం అవుతోంది. పెర్త్ టెస్ట్‌లోనే కంగారూలకు షాక్ ఇచ్చి సిరీస్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లాలని చూస్తోంది.

అయితే అన్ని విభాగాల్లో బలంగానే ఉన్నా బ్యాటింగ్ యూనిట్ కొంత ఆందోళన కలిగిస్తోంది. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ తొలి టెస్టుకు అందుబాటులో లేకపోవడం మరో షాక్. న్యూజిలాండ్ సిరీస్‌లో బ్యాటర్లు దారుణంగా ఆడటం ఫ్యాన్స్‌ను మరింత టెన్షన్ పడుతోంది. అందుకే పేస్, బౌన్స్, స్వింగ్‌కు స్వర్గధామం లాంటి పిచ్‌లపై ఆసీస్‌ను ఓడించాలంటే ఛతేశ్వర్ పుజారా లాంటి సీనియర్ బ్యాటర్ టీమ్‌లో ఉండాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. ఎట్టకేలకు వారి కోరికలు ఫలించాయి. బీజీటీ కోసం పుజారా రాక ఖాయమైంది. ఈ సిరీస్‌లో అతడు పార్టిసిపేట్ చేయనున్నాడు. కానీ సూపర్ ట్విస్ట్ ఉంది. అదేంటో ఇప్పుడు చూద్దాం..

కొత్త అవతారంలో..

100కు పైగా టెస్టులు ఆడిన అనుభవం, 7 వేలకు పైగా పరుగులు, 19 సెంచరీలు, 3 డబుల్ సెంచరీలు చేసిన బ్యాటర్. ఏళ్ల నుంచి జట్టు బ్యాటింగ్ భారాన్ని మోస్తున్నాడు. టీమిండియా టెస్టుల్లో సూపర్ పవర్‌గా ఎదగడంలో అతడి కృషి గురించి ఎంత మెచ్చుకున్నా తక్కువే. అతడే ఛతేశ్వర్ పుజారా. ఇన్ని సాధించిన ఈ దిగ్గజ ఆటగాడ్ని సెలెక్టర్లు కొన్నాళ్లుగా పట్టించుకోవడం లేదు. పేలవమైన ఫామ్, వయసు, భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకొని అతడికి బదులు యంగ్‌స్టర్స్‌కు ఛాన్సులు ఇస్తోంది. అయితే పుజారా మాత్రం డొమెస్టిక్ క్రికెట్‌పై ఫోకస్ పెట్టి సత్తా చాటుతున్నాడు. అలాంటోడ్ని ఎలాగైనా ఆసీస్ సిరీస్‌లో ఆడించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అది నెరవేరనుంది కూడా. అయితే ప్లేయర్‌గా కాదు.. కామెంటేటర్‌గా కొత్త అవతారంలో పుజారా ఫ్యాన్స్‌ను ఎంటర్‌టైన్ చేయనున్నాడు.

హిందీ కామెంట్రీ

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మ్యాచులకు పుజారా కామెంట్రీ ఇవ్వనున్నాడు. హిందీలో అతడు వ్యాఖ్యానం చేయనున్నాడు. ఇది తెలిసిన కొందరు అభిమానులు హ్యాపీ ఫీలవుతున్నారు. కనీసం కామెంట్రీ రూపంలోనైనా పుజారా అలరించనుండటం మంచి విషయమని అంటున్నారు. కంగారూ గడ్డపై తాను ఆడినప్పటి విశేషాలు, అక్కడి పిచ్‌ల స్వభావం గురించి అతడి మాటల్లో వినాలని ఉందని అంటున్నారు. అయితే మరికొందరు ఫ్యాన్స్ మాత్రం గత బీజీటీలో సెకండ్ హయ్యెస్ట్ రన్ స్కోరర్‌గా ఉన్నోడ్ని టీమ్‌లోకి తీసుకోలేదని.. అతడితో కామెంట్రీ చేయించడం కరెక్ట్ కాదని చెబుతున్నారు.

# టీమిండియాను ఇబ్బంది పెడుతున్న ఒకే ఒక్కడు..



పెర్త్: ఆస్ట్రేలియాతో కీలక సిరీస్ ముంగిట టీమిండియాకు కొత్త చిక్కులు మొదలవనున్నాయి. ఇప్పటికే శుభ్ మన్ గిల్ గాయపడటం, కెప్టెన్ రోహిత్ శర్మ జట్టుకు దూరంగా ఉండటం వంటివి భారత జట్టులో క్రికెటర్ల సంఖ్య రోజురోజుకీ క్షీణిస్తోంది.

తాజాగా టీమిండియా కొత్త సమస్యను ఎదుర్కొంటోంది. పేస్ బౌన్స్ కలిగిన పెర్త్ పిచ్‌లో స్పిన్నర్లకు అంత ఇంపార్టెన్స్ ఇవ్వాల్సిన అవసరం లేదంటారు. అందువల్ల భారత్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఒకే ఒక్క స్పిన్నర్‌ను చేర్చుకునే అవకాశం ఉంది. అది రవీంద్ర జడేజానే అయ్యే అవకాశం ఉంది. అయితే పెర్త్ టెస్టులో ఆర్ అశ్విన్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఆడించాలని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తన అభిప్రాయాన్ని తెలిపాడు. "అశ్విన్‌ను ఆడించాలా వద్దా అనే దానిపై ఎలాంటి చర్చ అవసరం లేదని, జట్టులోని అత్యుత్తమ స్పిన్నర్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఆడించాలని గంగూలీ అన్నాడు. టెస్ట్ క్రికెట్ అనేది నిపుణుల కోసం. అశ్విన్ కంటే రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ మెరుగైన బ్యాట్స్‌మెన్ అన్నది నిజం. కానీ, జట్టులో ఈ అత్యుత్తమ స్పిన్నర్‌ను తొలి టెస్టులో ఆడించాలి. అదేవిధంగా, ప్లేయింగ్ ఎలెవన్‌లో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్ల అవసరం ఉంది. అందుకే తొలి టెస్టుకు అశ్విన్ నా ఎంపిక. ఆస్ట్రేలియా జట్టులో చాలా మంది ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ ఉన్నందువల్ల అశ్విన్ రాణించగలడు" అని గంగూలీ తాజా ఇంటర్వ్యూలో తెలిపాడు. న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో అశ్విన్ మెరుపులు మెరిపించలేదు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల్లోనూ ఆడిన అశ్విన్ 10 వికెట్లు కూడా తీయలేకపోవడం భారత్ సిరీస్ ఓటమికి కూడా అద్దం పట్టింది. ఈ స్థితిలో పెర్త్ టెస్టులో అశ్విన్‌కు చోటు దక్కకపోవచ్చని భావిస్తున్నారు. రవీంద్ర జడేజా స్థానంలో వాషింగ్టన్ సుందర్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వస్తాడని అంతా భావించారు.

# పేసర్ల దూకుడు.. కోహ్లీకి తప్పని కష్టాలు..

## పెర్త్‌లో అసలేం జరుగుతోంది

పెర్త్: ఆసిస్ పర్యటనలో ఉన్న టీమిండియా టీం ప్రస్తుతం సిమ్యులేషన్ మ్యాచ్ లో తలమునకలై ఉంది. ఇండియా ఎ తో మూడో రోజు జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, శుభ్ మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రిషభ్ పంత్ వంటి ఆటగాళ్లంతా పాల్గొన్నారు. తొలి రోజు క్రికెటింగ్ కాంటెస్ట్ ఏర్పాటు చేయగా రెండో రోజు ఎ గేమ్ నెట్ సెషన్స్ లో టీమిండియా పోరాడింది. అయితే, మూడో రోజు మ్యాచ్ లో భాగంగా మరోసారి స్టార్ క్రికెటర్ల పేలవ ప్రదర్శన బట్టబయలైంది. పేసర్లు రెచ్చిపోయి ఆడటంతో కోహ్లీతో పాటు పంత్, గిల్ వంటి ఆటగాళ్లకు కష్టాలు తప్పడం లేదు. దీంతో ఈ మ్యాచ్ లో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్-ఎ మధ్య జరిగిన సిమ్యులేషన్ గేమ్‌లో కొంతమంది ఆటగాళ్లకు రెండుసార్లు బ్యాటింగ్ చేసే అవకాశం ఇస్తున్నట్టు భారత కోచ్ అభిషేక్ నాయర్ వెల్లడించారు. తొలిరోజు కోహ్లీ రెండుసార్లు బ్యాటింగ్ చేయడంపై భారత కోచ్ అభిషేక్ నాయర్ మాట్లాడుతూ.. తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఇదే పరిస్థితిని పోటీకి సిద్ధం చేయాలని తొలుత నిర్ణయించారు. ఒకవేళ ఔటైతే మరో బ్యాటింగ్‌కు అవకాశం ఇచ్చేవారం కాదు. అయితే కోచ్ గౌతం గంభీర్ జోక్యం చేసుకుని మ్యాచ్ పరిస్థితిని మార్చేశాడు. బ్యాట్స్‌మెన్‌లు క్రీజులో నిలదొక్కుకునేందుకు మరింత ఎక్కువ సమయం కల్పించడమే తమ లక్ష్యమని అభిషేక్ శర్మ తెలిపాడు.

రెండోసారి అవకాశం ఇస్తే బ్యాట్స్‌మెన్ పరిస్థితులకు తగ్గట్టుగా ఆటను మలుచుకోవచ్చు. అందుకే ఈ అవకాశం ఇచ్చినట్లు అభిషేక్ నాయర్ తెలిపాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో మూడో రోజు మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసిన రుతురాజ్ గైక్వాడ్ అద్భుతంగా మెరిశాడు. రుతురాజ్ గంటపాటు క్రీజులో నిలిచాడు. అశ్విన్‌పై నాలుగు సిక్సర్లు కొట్టి 67 బంతుల్లో 47 పరుగులు చేసిన రుతురాద్ బుమ్రాను రుతురాజ్ ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నాడు. సర్ఫరాజ్ ఖాన్ 36 బంతుల్లో 28 పరుగులు చేయగా, దేవదత్ పాటికల్ 25 బంతుల్లో 12 పరుగులు చేశాడు. బుమ్రా ఇన్‌స్వింగర్‌లో పాటికల్ ఔటయ్యాడు.

తొలిరోజు శిక్షణ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్‌లకు అవకాశం లభించగా, రెండో రోజు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ సహా బౌలర్లు ఎక్కువగా బౌలింగ్ చేశారు. సిరాజ్ 15 ఓవర్లు, బుమ్రా 18 ఓవర్లు బౌలింగ్ చేశారని అభిషేక్ నాయర్ చెప్పారు. హర్షిత్ రాణా కూడా రెండు వికెట్లు తీయగా, షార్ట్ బంతులను చక్కగా కొట్టిన హర్షిత్ రాణా రెండు వికెట్లు తీయగా, సిరాజ్ వలం కయాన్ బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టాడు. ఆకాశ్ దీప్, ముఖేష్ కుమార్, బుమ్రా ఒక్కో వికెట్ తీశారు. పెర్త్‌లోని పరిస్థితులకు అనుగుణంగా ఇది మరింత ఉపకరిస్తుందని అభిషేక్ నాయర్ అన్నారు.



Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**